

ఇటీవల తెనాలిలో రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ పోలీసులకు చిక్కిన ఎండీయూ వాహనం

ఎండీయూ ముసుగు.. అక్రమార్కులకదే లోసుగు

- ఇంటింటికీ బియ్యం అందించాల్సిన వాహనాలే నల్లబజార్‌కు తరలిస్తూ...
- రేషన్ మాఫియా బరితెగింపుతో ప్రభుత్వంపై మోయలేని భారం
- అక్రమార్కులకు రూ. కోట్ల ఆదాయం
- ప్రభుత్వంపై బియ్యం కొనుగోలుకు తోడు, వాహనాల ఖర్చు కూడా

పేదలకోసం ఇంటింటికీ వెళ్లి బియ్యం, రేషన్ సరకులు అందించటానికి గత వైసీపీ సర్కారు ఏర్పాటు చేసిన వాహనాలవి. కానీ అవి పేదల ఇంటికి వెళ్లకుండా బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తే!... ఇంటింటికీ వెళ్లకుండా ఏదోఒక బజారు కూడలిలో పెట్టి ఒకరిద్దరికి అందించి, అందరికీ ఇచ్చేసినట్టు పేదల బియ్యాన్ని మాయం చేసేస్తుంటే... ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్నట్టు అధికారులు, ప్రభుత్వంలోని రాజకీయ పెద్దలే కళ్లుమూసుకుని చూసీచూడనట్టు వదిలేస్తే... ప్రభుత్వంపై భారం, పేదలకు పస్తులు మిగులుతుంటే, అక్రమార్కులు మాత్రం రూ. కోట్లకు పడగలెత్తుతున్నారు. వారిని శిక్షించాల్సిన చట్టాలు కూడా చుట్టాలై చిన్నపాటి జరిమానాలతో సరిపెట్టేస్తుండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలిపోతోంది. దీనికోసం గ్రామాల్లో మూతపడే స్థితిలో ఉన్నరైస్ మిల్లులుకూడా తెరచుకుని రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టేస్తున్నాయి. మరికొన్ని మిల్లులు పూర్తిగా ఈ బియ్యం పాలిష్‌పట్టి, తిరిగి ప్యాకింగ్ చేసేందుకు సిద్ధమవటం గత ప్రభుత్వ కాలంలో రెచ్చిపోయిన రేషన్ మాఫియా ఇంకా విజృంభిస్తోందనటానికి ప్రస్తుతం దొరికిపోతున్న అక్రమ బియ్యం తరలింపు వాహనాలే ఉదాహరణగా నిలుస్తున్నాయి.

తెనాలి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 14.91 లక్షల తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులున్నారు. వీరికి ప్రతి నెలా 2.04 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తోంది. అయితే దీనిపై భారం మాత్రం ప్రభుత్వంపై భారీగానే పడుతోంది. కానీ అవన్నీ నిజంగా లబ్ధిదారులకే అందితే ఎంత భారమైనా లక్ష్యం నెరవేరిందని, పేదలకు ఆకలి తీర్చగలిగామని ప్రభుత్వం సరిపెట్టుకోవచ్చు. కానీ ఇక్కడ సగంపైగా బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లి, నల్ల బజారుకు తరలిపోతుంటే ప్రభుత్వానికి భారమే మిగులుతోంది. అటు లబ్ధిదారునికీ చిల్లర విదిలింపులు దక్కుతున్నాయి. వీరిద్దరిమధ్య అక్రమ తరలింపనకు బరితెగిస్తున్న వారు మాత్రం రూ. కోట్లకు పడగలెత్తుతున్నారు. గత ప్రభుత్వంలో అయితే సాక్షాత్తు ఎమ్మెల్యే స్థాయి నేతలే దందా వెనకుంటే, ఇప్పుడు చిన్నస్థాయి నాయకులు కక్కుర్తి పడుతున్నారు. దీంతో పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి.

ఎండీయూ వాహనాలు రేషన్ మాఫియా చేతుల్లోకి

రాష్ట్రంలోని పేదలు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం, ఇతర నిత్యవసరాలు తెచ్చుకోవటం కష్టమయిపోతుందంటూ గత వైసీపీ సర్కారు భారీ ఖర్చుతో ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ తీసుకువెళ్లి తామే అందిస్తామని గొప్పగా చెప్పింది. అంతా అది నిజమేనని సంతోషపడ్డారు. కానీ ఆ వాహనాలు ఆ వీధిలో ఏదోఒక చివర ఆపేసి సైరన్ కొడితే లబ్ధిదారులే సంచులు, రేషన్ కార్డులు చేతపట్టుకుని వాహనాల దగ్గరకు పరుగు పెట్టాల్సిన పరిస్థితి. ఆ సమయంలో ఎవరైనా ఇంటిలో లేకుంటే వారికి బియ్యం ఆ నెలకు అందనట్టే. వాహనం దగ్గరకు వచ్చిన కొద్దిమంది లబ్ధిదారులకు ఇచ్చామనిపించి మిగిలిన వాటిని నేరుగా నల్లబజార్‌కు తరలించేస్తుండటం ఇక్కడ కొసమెరుపు. సాధారణంగా రేషన్ దుకాణాలు ఇళ్ల మధ్యే ఉండటం, వాటి దగ్గరకు సరకు దింపే లారీలం

మినహా మరే ఇతర వాహనం వచ్చినా రేషన్ సరకులు నల్లబజారుకు తరలిస్తున్నారని ఇట్టే పసిగట్టి చుట్టుపక్కలవారు అధికారులకు సమాచారం అందించే పరిస్థితి ఉండేది. ఇదంతా ఏ అడ్డంకులు లేకుండా అధికారికంగానే బియ్యాన్ని తన్నుకుపోవచ్చని ముందుచూపుతో కొనుగోలుచేశారేమో కానీ, గత ప్రభుత్వంలోని పెద్దలు అనుకున్న అక్రమ బియ్యం తరలింపులకు ఈ ఎండీయూ వాహనాలు బాగా పనికొచ్చాయి. అయితే ఇప్పుడు కూడా ఈ వాహనాలు అక్రమార్కుల చేతుల్లోనే ఉండటం విశేషం. అసలు ఈ వాహనాలు అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చక, నిరుపయోగం అనుకుంటున్న తరుణంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వరుస దాడులతో ఈ వాహనాల అక్రమ వ్యాపారం ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. తాజాగా తెనాలి లోనూ రెండు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అయితే వీటి ఆగడాలకు హద్దేలేదు.

ఎండీయూ వాహనాలు రద్దు చేసేనా!

రేషన్ పంపిణీలో ఎండీయూ వాహనాలు కీలకం. గత ప్రభుత్వం అనుకున్న ప్రకారం నిజంగా ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి పేదలకు బియ్యాన్ని అందించి వస్తే దీనికి మించిన మేలు మరోటి ఉండదు. కానీ గతంలో ఒకరోజు ఊరిలో లేకున్నా, మరుసటి రోజయినా రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం, ఇతర సరకులు తెచ్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు వాహనాలు వచ్చినప్పుడు లేకుంటే రేషన్ ఆ నెల అందటం కష్టతరమే. దీనికితోడు ఇంటింటికి కాదుకదా! కనీసం ఒక వీధిలో పట్టుమని ఒక గంటకూడా నిలిపి ఉంచకుండా పదిమందికిచ్చి వెళ్లిపోతుండటం లబ్ధిదారులకు ఇబ్బందిగా మారుతున్న పరిస్థితి. ఇది లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బంది అయితే, అటు ప్రభుత్వానికీ భారమే అవుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొత్తం 959 వరకు ఎండీయూ వాహనాలున్నాయి. వీటికి ప్రతి నెలా వాహన నిర్వహణ, వాహనదారుని ఆదాయం, నెలవారీ రుణ వాయిదా, సహాయకుని ఛార్జీల రూపంలో ప్రభుత్వం ఒక్కో వాహనానికి రూ. 21వేలు చెల్లిస్తుంది. అంటే ఈ జిల్లాల్లోని వాహనాలకే నెలకు రూ. 2.01 కోట్లుపైగా చెల్లిస్తోంది. అంటే సంవత్సరానికి రూ. 24.16 కోట్లు వెచ్చిస్తోంది. ఇవే కాకుండా ఇంత ఖర్చు చేసినా, అనుకున్న లక్ష్యం నెరవేరుతుందా అంతే అదీలేదు. పైగా ప్రభుత్వంపైనే భారం మోపేలా పేదల బియ్యాన్ని నల్ల బజారుకు తరలించేస్తుండటంతో వీటి అవసరం ఎంతవరకు ఉందనే కోణంలోనూ ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే వీటి వల్ల జరుగుతున్న ఉపయోగంకంటే నష్టమే ఎక్కువ ఉండటంతో అసలు వీటిని రద్దు చేస్తారనే అలోచనా సాగుతోంది. ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందోనేదానిపై ఉత్కంఠత ఉంది.



ఇటీవల తెనాలిలో పట్టుబడినఎండీయూ వాహనం

పేదలకు చిల్లర... అక్రమార్కులకు రూ. వేలకోట్లు

కిలో బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ. 45 నుంచి రూ. 55 వరకు రేటు ఉంది. మరీ సాధారణ రకం అయితే రూ. 35 నుంచి రూ. 40లోపు దొరుకుతున్నాయి. అయితే ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అందిస్తుండటంతో వాటి రేటు కిలో రూ. 45 చొప్పున లెక్కకట్టినా, భారం మాత్రం భారీగానే ఉంటోంది. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు పూర్తి ఉచితంగా బియ్యాన్ని అందిస్తుంటే, అసలు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎండీయూ వాహనదారులు కానీ, అక్రమార్కులు కానీ కిలో రూ. 10 నుంచి రూ. 15కు అమ్ముతున్నారు. మండలంలోని అక్రమ వ్యాపారులు వాటిని పాలిష్ పట్టించి కిలో రూ. 28 నుంచి రూ. 30 వరకు పై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. కొందరు లబ్ధిదారులు ఇష్టప్రకారం బియ్యం అమ్మినా వారికి చెల్లించేది ఒక కిలోకు రూ.8 మాత్రమే. కానీ అక్రమార్కులు మాత్రం రూ. 20 నుంచి రూ. 22 వరకు అప్పనంగా దోచేస్తున్నారు. ఇక్కడ భారం ప్రభుత్వంపై పడుతుంటే, లబ్ధిదారులకూ చిల్లరే అందుతుంది. కానీ మధ్య వ్యాపారులు మాత్రం భారీగా దోచేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 14.91 లక్షల రేషన్ కార్డులుంటే, వీరికోసం ప్రతి నెలా ప్రభుత్వం 2.04 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. గతంలో డీలర్ల దగ్గర బియ్యం పక్కదారి పట్టినా వారికి అందిన కోటాలో పది నుంచి 15 శాతం మధ్య ఉండేది. ఎండీయూ వాహనాలు వచ్చాక తరలింపు తేలికవటంతో 50 నుంచి 60 శాతం బయటకు వెళ్లిపోతున్నాయి. 2.04 లక్షల క్వింటాళ్లలో కనీసం 80వేల క్వింటాళ్లే నల్లబజారుకు తరలుతున్నాయనుకుంటే, వీటిపై కిలో రూ. 8 చొప్పున లబ్ధిదారులకు అందుతున్న మొత్తం రూ. 64 కోట్లయితే, కిలో రూ. 28 రేటు చొప్పున అక్రమార్కులు అందుతున్నది మాత్రం రూ. 224 కోట్లపైనే ఉంది. అయితే ప్రభుత్వానికి మార్కెట్ రేటుకంటే తక్కువకే అందతాయనుకుంటే, రూ. 35 చొప్పున కిలో బియ్యం విలువ లెక్కించినా రూ. 280 కోట్లపైనే భారం పడుతోంది.

ఎన్నిసార్లు పట్టుకున్నా మారని తీరు

ప్రభుత్వం పేదలకోసమని భారీగా ఖర్చు చేస్తుంటే, దానిని రేషన్ మాఫియా తమకు ఆదాయ వనరుగా మార్చుకుంది. తెనాలిలో ఇద్దరు వ్యాపారులు ఇదే వ్యాపారం కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నారు. పలనాడులో ఒక్కో నియోజకవర్గంలో మాఫియా రెండు వర్గాలు విడిపోయి దందా నడుపుతున్నారు. గుంటూరు డివిజన్ పరిధిలో కూడా మాఫియా రెండువర్గాలు చీలి ఒకరినొకరు పట్టించుకోవడం గమనార్హం. వీరిని పోలీసులు, రెవెన్యూ అధికారులు అనేకసార్లు పట్టుకుని కేసులు నమోదు చేసినా, ఆహార, నిత్యావసర సరకుల చట్టం ప్రకారం పెద్దగా శిక్షలు లేవనే కారణంతో తక్కువ మొత్తంలో జరిమానాలు చెల్లించి బయటకు వచ్చేసి మళ్లీమళ్లీ అదే తరహా అక్రమ వ్యాపారానికి సిద్ధపడుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక తెనాలి, వేమూరు, పొన్నూరు, రేపల్లె, బాపట్ల, పెదకూరపాడు, గుంటూరు, నరసరావుపేట, పల్నాడులోని మరికొన్ని నియోజకవర్గాల పరిధిలో కేవలం రేషన్ బియ్యం పాలిష్ పట్టేందుకే కొన్ని రైస్‌మిల్లులు పుట్టుకు రావటం విశేషం.



సోలార్ ప్యానల్స్

విద్యుత్తు ఆదాకు.. సూర్యఘర్

- కరెంటు మిగిలితే ఆదాయం కూడా
- అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) వినియోగదారులపై గృహ విద్యుత్తు భారం తగ్గించేందుకు కేంద్రం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఇంటి పైకప్పు నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చు. సొంత వినియోగం తర్వాత మిగులు కరెంటు ద్వారా అదనపు ఆదాయం కూడా పొందొచ్చు. ఈ పథకాన్ని అందిపుచ్చుకుంటే ప్రతి ఇంట్లో సౌర వెలుగులు కాంతులీనుతాయి. ఇంటిలో విద్యుత్ వినియోగం 120 యూనిట్లు దాటితే సూమారు రూ.1,000 విద్యుత్తు బిల్లు వస్తోంది. అదే సోలార్ రూఫ్ టాప్ కేవలం రూ.338 మాత్రమే ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. ఏడాదికి రూ.8 వేలు వరకు ఆదా అవుతుంది. సూర్యఘర్ పథకంలో వంద చదరపు అడుగుల స్థలంలో 120 యూనిట్లు ఉత్పత్తి చేసే ఒక కిలోవాట్ సామర్థ్యం ఉన్న రూప్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు సుమారు రూ.60 వేలు ఖర్చయితే 50 శాతం, అంటే రూ.30 వేలు ప్రభుత్వం రాయితీగా ఇస్తోంది. మిగిలిన మొత్తం బ్యాంకుల నుంచి రుణంగా పొందొచ్చు.

రిజిస్ట్రేషన్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్ లోకి వెళ్లి పీఎం సూర్యఘర్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా మొబైల్లో రిజిష్టర్ చేసుకోవాలి. ఇంటి సర్వీసు నంబరు అనుసంధానం చేసి, రిజిస్ట్రేషన్ చేసుకొవాలి. ఇందుకు రూ. 1,190 చెల్లించాలి. ఆ తర్వాత విద్యుత్తు సిబ్బంది ఇంటి పై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసి, మీటర్లు అమర్చుతారు. ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్స్ అమర్చుకుంటే రూ.30 వేలు ఖర్చవుతుంది. ఆ మొత్తాలు నాలుగేళ్లలో విద్యుత్తు బిల్లు రూపేణా ఆదా అవుతుంది. అనంతరం ప్రతి యూనిట్ నుంచి ఆదాయం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టింది. ఇప్పటికే నెలకు రూ. 1,000 బిల్లు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ, వార్డు స్థాయి లైన్‌మెన్లు వారి చెంతకు వెళ్లి పథకం లబ్ధిని వివరిస్తున్నారు. ఒక్కో లైన్‌మెన్ కనీసం నెలకు 10 మంది వినియోగదారులనైనా చైతన్యం చేసి సోలార్ విద్యుత్తు వైపు మళ్లించేవిధంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసే విషయమై సమగ్ర సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వినియోగదారులకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం సూర్య ఘర్‌కు ఇస్తున్న రాయితీను వినియోగదారులకు తెలియజేస్తున్నారు. సోలార్ విద్యుత్తుతో కలిగే ప్రయోజనాలను చెబుతున్నారు. ఇంటి అవసరాల తర్వాత మిగిలితే విద్యుత్తును గ్రిడ్‌కు పంపించి, ఆదాయం పొందొచ్చు. దీనిపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. వినియోగదారుల సందేహాలను కూడా విద్యుత్ కార్యాలయాల్లో అధికారులు నివృత్తి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సూమారు 2,100 యూనిట్‌లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. సూర్యఘర్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులు 28మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రాయితీ సొమ్ము కూడా విడుదలైందని విద్యుత్ శాఖ ఈఈ రాంబొట్లు తెలిపారు.

సామర్థ్యం	అయ్యే ఖర్చు	రాయితీ
ఒక కిలోవాట్	రూ.60వేలు	రూ.30వేలు
రెండు కిలోవాట్	రూ.1.20లక్షలు	రూ.60వేలు
మూడు కిలోవాట్	రూ.1.80లక్షలు	రూ.78వేలు



మద్యం దుకాణాలకు దరఖాస్తులు

- గుంటూరు, పల్నాడు జిల్లాలో 256 షాపులకు నోటిఫికేషన్
- లాటరీ ద్వారా ఎంపిక
- ఎక్సైజ్ స్టేషన్‌లలో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులకు డిజిటల్ అసిస్టెంట్ నియామకం
- గౌడ సంఘీలకు 25 మద్యం షాపులు కేటాయింపు
- గుంటూరులో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 1: ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి.. వాటిస్థానంలో ప్రైవేటు వ్యక్తులకు మద్యంషాపులు కేటాయించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది.. మంగళవారం నుండి ఈనెల 9వ తేదీవరకు దరఖాస్తులను ఆయా ఎక్సైజ్‌స్టేషన్ ద్వారా, లేదా నేరుగా ఇంటర్నెట్ ద్వారానే ఆన్‌లైన్(హెచ్‌టీటీపీఎస్://హెచ్‌పీఎఫ్ఎస్ పీఆర్ఓజే ఈసిటీ.కామ్)లో షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చు. గుంటూరు జిల్లాలో 127 షాపులకు, పల్నాడు జిల్లాలో 129 షాపులకు మొత్తం కలిపి 256 మద్యం దుకాణాలకు 2 సంవత్సరాల పరిమితి మేరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీకమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు మంగళవారం విలేకరుల సమావేశం లో వెల్లడించారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తర్వాత ఈనెల 11న గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో, పల్నాడు జిల్లాకు నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్ టౌన్‌హాల్లో ఆయా జిల్లాల కలెక్టర్‌ల ఆధ్వర్యంలో లాటరీ నిర్వహిస్తామన్నారు.

జనాభా ప్రాతిపదికన శ్లాబ్ రేట్లు వివరాలు ..

గుంటూరు, పల్నాడు జిల్లాలో మద్యం షాపులకు సంబంధించిన స్లాబ్ రేట్లు జనాభా ప్రాతిపదికన ఇలా ఉన్నాయి. 10వేల జనాభా కలిగిన ప్రాంతంలో రూ.50 లక్షలు, 50వేల లోపు జనాభా కలిగిన ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 5లక్షల లోపు జనాభా ప్రాంతాల్లో రూ.65లక్షలు, 5 లక్షల జనాభా పైన ఉన్న ప్రాంతాల్లో రూ.85లక్షలు చొప్పున మొదటి సంవత్సరం, రెండో సంవత్సరంలో మరో 10శాతం పెంచి ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. షాపులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, లాటరీలో ఎంపికైన వ్యక్తి అదేరోజు ప్రభుత్వ శ్లాబ్ రేట్లలో 6వ వంతు చెల్లించాల్సి ఉంది. మిగిలిన మొత్తాన్ని ఆ ఏడాది మొత్తం మీద 6 దఫాలుగా చెల్లించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ప్రతి షాప్‌నకు రూ.2లక్షల చొప్పున దరావతు ఫీజు చెల్లించి(నాన్ రిఫండబుల్) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

గుంటూరు జిల్లాలో 127 షాపులు..

గుంటూరు జిల్లాలో మొత్తం 127 షాపులు ఉన్నాయి. అందులో గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 33 షాపులు, మంగళగిరి తాడేపల్లి పరిధిలో 19షాపులు, పొన్నూరులో 4షాపులు, తెనాలిలో 11షాపులు కేటాయించారు. అలాగే చేబ్రోలు6, దుగ్గిరాల్లో5, గుంటూరురూరల్‌లో 2, కాకుమానులో 2, కొల్లిపరలో 4, మేడికొండూరులో 5, పెదకాకానిలో 4, పెదనందిపాడులో 3, ఫిరంగిపురం 5, పొన్నూరు రూరల్‌లో3, ప్రత్తిపాడు 4, తాడికొండ 5, తెనాలి రూరల్ 5, తుళ్లూరు 4, వట్టిచెరుకూరులో3 చొప్పున మొత్తం గుంటూరుజిల్లా పరిధిలో 127షాపులు కేటాయించారు.

పల్నాడు జిల్లాలో..129 షాపులు..

పల్నాడు జిల్లాలో మొత్తం 129షాపులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మున్సిపాలిటీల పరిధిలో కేటాయించిన షాపులు వివరాలు.. చిలకలూరిపేటలో 6, మాచర్లలో 3, నరసరావుపేటలో 7, పిడుగురాళ్లలో 4, సత్తెనపల్లిలో 6, వినుకొండలో 6 కేటాయించారు. నగర పంచాయతీలైన దాచేపల్లిలో 4, గురజాలలో 4 కేటాయించారు.

- మండలాల వారీగా కేటాయించిన షాపులు వివరాలు.. అమరావతిలో 5, అచ్చంపేట 4, బెల్లంకొండ 2, బొల్లాపల్లి 3, చిలకలూరిపేట రూరల్ 3, దాచేపల్లి రూరల్ 2, దుర్గి 2, యడ్లపాడు 3 గురజాల రూరల్ 3, ఈపూరు 2, కారంపుడి 3, క్రోసూరు 4, మాచవరం 2, మాచర్ల రూరల్2, ముప్పాళ్ళ 2, నాదెండ్ల 5, నరసరావుపేట రూరల్ 6, నకరికల్లు 4, నూజెండ్ల3, పెదకూరపాడు 5 పిడుగురాళ్ల రూరల్ 3, రాజుపాలెం 2, రెంటచింతల 2, రొంపిచర్ల 4, సత్తెనపల్లి రూరల్ 5, శావల్యాపురం 2, వెల్దుర్తి 3, వినుకొండ రూరల్ 3 షాపుల చొప్పున కేటాయించారు.

ప్రతి ఎక్సైజ్‌స్టేషన్లో దరఖాస్తుల స్వీకరణ..

గుంటూరు, పల్నాడు జిల్లాలోని 16 ఎక్సైజ్‌స్టేషన్లో దరఖాస్తుల స్వీకరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అవగాహన ఉండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పర్వాలేదు, లేకపోతే అట్టివారికి నేరుగా సంబంధిత ఎక్సైజ్‌స్టేషన్లో వారి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తారు. ఇందుకోసం గుంటూరు, పల్నాడు జిల్లాలో 16మంది డిజిటల్ అసిస్టెంట్లను ఆయాజిల్లాల కలెక్టర్లు నియమించారు.

రెండు జిల్లాల్లో గౌడ సంఘీయులకు 25 షాపులు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉన్న 256 షాపులలో 10శాతం అనగా 25షాపులను గౌడసంఘీయులకు కేటాయించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత, వెంటనే 25 షాపులకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది. వీరికికూడా దరఖాస్తులను ఆహ్వానించి, వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించి, లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గుంటూరులో ప్రీమి యం లిక్కర్‌స్టోర్‌ను ఏర్పాటుచేయనుంది. దీనికి త్వరలో దరఖా స్తులు కూడా ఆహ్వానించనున్నట్లు సమాచారం.

పడిపోతున్న.. పత్తి ధరలు

- క్వింటాకు రూ.1,500 కు పైగా పతనం
- పంట వచ్చే సమయంలో పడిపోయిన ధర
- ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు
- ఆందోళనలో అన్నదాతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పత్తి ధరలు మార్కెట్‌లో రోజురోజుకూ పతనమవుతున్నాయి. పంట చేతి కొచ్చే సమయంలో రేటు పడిపోతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రూ.8వేల నుంచి రూ.6వేలకు ధర పడిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మార్కెట్‌లో లభించడంలేదు. సీసీఐ కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి ధర ప్రైవేట్ మార్కెట్‌లో నెల రోజుల క్రితం వరకు క్వింటా రూ 8 వేల వరకు ధర ఉందని రైతులు తెలిపారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో క్వింటా ధర రూ 6,000 నుంచి రూ 6500 వరకు పడిపోవడంతో వారు అందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ అయి ధరలను తగ్గించి వేశారని విమర్శిస్తున్నారు. ఆగస్టు వరకు మార్కెట్‌లో పత్తికి మంచి ధర ఉండటంతో రైతులు ఖరీఫ్‌లో పత్తి సాగు చేశారు. వేసవిలోనే పల్నాడు ప్రాంతంలో బోరు బావుల కింద ముందస్తుగా సాగు చేసిన పత్తి ప్రస్తుతం చేతికి వస్తోంది. సీజన్ దిగుబడులు ఆరంభం కావడంతో ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి.

2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి సాగులో పల్నాడు జిల్లాలో రెండవ స్థానంలో ఉంది. 1,54,875 ఎకరాల్లో పత్తి సాగైంది. గుంటూరు జిల్లాలో 53,275 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,065 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లను అధిక మించి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి ధర పతనం అవడంతో రైతులు అందోళన చెందుతున్నారు.

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గత సీజన్‌లో రూ. 7,020 ఉన్న మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం రూ 7,521గా పెంచింది. మద్దతు ధరకు ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వెనువెంటనే కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు అంటున్నారు. ఈ నెలాఖరుకు జిల్లా అంతటా పత్తి దిగుబడులు రానున్నాయి. సీసీఐ వెంటనే రంగంలోకి దిగి కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలి. లేకుంటే మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతామని రైతులు వివరిస్తున్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై మార్కెటింగ్ శాఖ ఏడీఎం సూర్య ప్రకాష్‌రెడ్డిని వివరణ కోరగా ఇంకా ప్రారంభించలేదని తెలిపారు. కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లపై 3న సీసీఐ మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ అధికారులతో సమావేశం జరగనున్నదని చెప్పారు. కాగా సీసీఐ కేంద్రాలను ఇంకా గుర్తించలేదని సమాచారం.



7 లో..

మళ్లీ మిర్చి రైతులను మోసగించిన వ్యాపారులు

- కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యాలు, కమీషన్ వ్యాపారస్తుల కుమ్మక్కు
- బయటపడిన తర్వాత బోర్డు తిప్పేసి అదృశ్యం

రేపటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష

- జిల్లాలో నాలుగు కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 9,556 మంది అభ్యర్థులు

మట్కాకు ముహూర్తం కుదిరింది



వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న 'మట్కా' చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. 1958-82 మధ్య కాలంలో జరిగే పీరియాడికల్ మూవీ ఇది. ఇందులో వరుణ్ నాలుగు విభిన్న గెటప్స్‌తో కనిపిస్తారు. ప్రస్తుతం కీలకమైన యాక్షన్ ఎపిసోడ్‌ను దర్శకుడు కరుణకుమార్ చిత్రీకరిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంతో జరుగుతోందనీ, నవంబర్ 14న సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాతలు డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి చెప్పారు. రిలీజ్ డేట్‌ను వెల్లడిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లు దిగి వస్తున్న వరుణ్‌తేజ్ రెట్రో గెటప్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లు.

'శ్వాగ్' ఒక వంశానికి సంబంధించిన కథ మాత్రమే కాదు పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 15వ శతాబ్దంలో మొదలయ్యే కథ కూడా. స్త్రీ, పురుషుల్లో ఎవరు గొప్ప అనే అంశంపై చర్చించే ఆసక్తికరమైన కథ. కొత్త కథలు ఎప్పుడు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం' అన్నారు శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం ఈ నెల నాలుగున విడుదలవుతున్న నేపథ్యంలో మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

మేకప్ కోసం నాలుగున్నర గంటలు



- నేనెప్పుడూ డ్యూయెల్ రోల్స్ వేయలేదు. కానీ ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. అందరూ ఒకే పోలికలతో ఉండే ఒకే వంశస్తులు. ఎలా చేయాలన్నది సవాల్‌గా అనిపించింది. గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక నమ్మకం కుదిరింది.. ఈ నాలుగు పాత్రల్లో సింగ పాత్ర కొంచెం ఈజీ అనిపించింది. మిగతా మూడూ కష్టమైనవే. రోజూ నాలుగున్నర గంటల సేపు మేకప్ చేసుకోవడం, దాన్ని తీయడానికి మరో రెండు గంటలు పట్టడం.. చాలా టఫ్. అయితే టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూసిన తర్వాత ఆ కష్టాన్ని మరిచిపోయా.
- చాలా పెద్ద కథ ఇది. దీన్ని రెండున్నర గంటల్లో చెప్పారా అని సినిమా చూశాక ప్రేక్షకులు దర్శకుడు హసిత్ గోలిని అభినందిస్తారు. కథలో భాగంగానే ఉండే వినోదం అందరినీ అలరిస్తుంది. నా కెరీర్‌లో వన్ ఆఫ్ ద టాప్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది.
- సినిమాలో క్యారెక్టర్ బ్యాక్ స్టోరీస్ బాగా కుదిరాయి. రీతూ వర్మ పాత్రలో మంచి ట్రాన్స్‌ఫర్మేషన్ ఉంటుంది. ఈ సినిమా చూశాక మహిళల్ని ఎక్కువ అభిమానిస్తాం. గౌరవిస్తాం.
- ఒక థ్రిల్లర్ చేస్తున్నాను. అలాగే గీతా ఆర్ట్స్‌లో ఓ మంచి ఎంటర్‌టైనర్ చేస్తున్నాను.

గోవిందాకు బుల్లెట్ గాయం



ప్రమాదవశాత్తు తుపాకి పేలిన ఘటనలో బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా గాయపడ్డారు. ఆయన కాలులోకి బుల్లెట్ దూసుకుపోయింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు సర్జరీ చేసి ఆ బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం ముంబై జుహూలోని గోవిందా నివాసంలో ఈ ఘటన జరిగింది. ఆయన లైసెన్స్ రివాల్వర్ చేతిలో నుంచి జారి కిందపడి హఠాత్తుగా పేలింది.


జీబ్రా అందరికీ నచ్చుతుంది



సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ నటిస్తున్న 'జీబ్రా' చిత్రం టీజర్‌ను హీరో నాని విడుదల చేశారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, పద్మజ, బాలసుందరం, దినేశ్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్ విడుదల కార్యక్రమానికి అతిథిగా వచ్చిన మంచు మనోజ్ మాట్లాడుతూ 'టీజర్ అదిరిపోయింది. ఈ చిత్ర నిర్మాత ఎస్నెస్ రెడ్డి నా శ్రేయోభిలాషి. బాగా ఖర్చుపెట్టి సినిమా తీశారు. నా అభిమాన నటుడు సత్యదేవ్. ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ 'ఓ కొత్త క్యారెక్టర్‌తో వస్తున్నా. అన్ని పరిశ్రమల్లోని ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ఇందులో ఉన్నారు. ప్రతి వ్యక్తికి ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు.

రజనీకి తీవ్ర అస్వస్థత

- రక్తనాళంలో వాపు
- స్టెంట్ వేసిన వైద్య బృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. సోమవారం అర్ధరాత్రి ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు ఆయన్ని గ్రీమ్స్‌రోడ్డులో వున్న అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. రజనీ అనారోగ్యం గురించి తెలియగానే ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా వుందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని మంగళవారం ఆసుపత్రివర్గాలు ప్రకటించాయి. 'గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళం (బృహద్ధమని)లో వాపు వచ్చింది. దీనికి శస్త్రచికిత్స చేయకుండా ట్రాన్స్‌కాథెటర్ విధానం ద్వారా చికిత్స చేయడం జరిగింది. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీష్ సారథ్యంలోని వైద్య బృందం స్టెంట్ వేసి, వాపును సరిచేశారు. ఎండోవాస్కులర్ రిపేర్ ప్రణాళికాబద్ధంగా సాగిందని ఆయన శ్రేయోభిలాషులకు, అభిమానులకు తెలియజేయాలనుకుంటున్నాం. రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి ఇంటికి వెళతారు' అని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నాయి. ఇదిలా వుండగా రజనీ త్వరగా కోలుకోవాలంటూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు ఆకాంక్షించారు. తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం స్వయంగా ఆసుపత్రికి వెళ్లి రజనీ ఆరోగ్యంపై వాకబు చేశారు. రజనీ క్షేమంగా వున్నారని, కోలుకుంటున్నారని మంత్రి ప్రకటించారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఫిలాసఫీ అధ్యయనం విస్తృతం కావాలి


ధ్రువ పత్రాలు అందజేస్తున్న అధికారులు

పెదకాకాని, అక్టోబరు 1: నేటి ఆధునిక జీవన శైలిలో తత్వ శాస్త్రాన్ని అనుసరించేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి మాట్లాడుతూ విభాగం ఆధ్వర్యంలో సిరీస్ ఆఫ్ లెక్చర్స్‌ను నిర్వహించుకునే వెసులుబాటు పరిశీలిస్తామన్నారు. ప్రొఫెసర్ నారాయణ చక్రవర్తి మాట్లాడుతూ కేవలం సదస్సుల ద్వారా తత్వశాస్త్రాన్ని బోధించలేమని తత్వశాస్త్రాన్ని కలిగి ఉండాలంటే విభిన్న రకాల బోధనా పద్ధతులను అనుసరించాలని పేర్కొన్నారు. ప్రొఫెసర్ తారీఖ్ ఇస్లామ్, ప్రొఫెసర్ అశోక్ వోహ్రా మాట్లాడుతూ తత్వ శాస్త్రాన్ని అర్థం చేసుకోవాలంటే కనీస అవగాహన ఉండాలన్నారు. కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు సదస్సు నిర్వహణకు అవకాశం కల్పించిన వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు, రెక్టర్ ప్రొఫెసర్ రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం ఆయా కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సదస్సులో పాల్గొన్న అతిథులను సన్మానించారు. పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జార్జి విక్టర్, వర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ జి.కొండలరావు, ప్రొఫెసర్ కె. రమేష్, ప్రొఫెసర్ సి.వెంకటాచలం, ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు, డాక్టర్ దివ్య తేజో మూర్తి, డాక్టర్ కె.సోమశేఖర్ పాల్గొన్నారు.

పెమ్మసాని కృషితో అమరావతికి టెక్నాలజీ యూనిట్

గుంటూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో రాజధాని అమరావతిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ యూనిట్ మంజూరైయింది. పార్లమెంటు పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, శంకర్ విలాస్ ఆర్‌వోబీతోపాటు పలు ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణానికి కృషి చేసిన ఆయన తాజాగా అమరావతికి మరో ప్రాజెక్టును సాధించారు. టెస్టింగ్ ఫెసిలిటీస్‌తో కూడిన రూ. 250 కోట్ల విలువైన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి మంజూరు చేయించారు. 2014లోనే ఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించగా, గత వైసీపీ ప్రభుత్వం దానిని కడప జిల్లా కొప్పర్తికి తరలించింది. దీనిపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపి దాన్ని తిరిగి రాజధాని అమరావతికి తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కృషి చేశారు. వారి ప్రయత్నాలు ఫలించడంతో టెక్నాలజీ సెంటర్ అమరావతికి మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీని సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో అమరావతి పరిధిలో 20 ఎకరాలు కేటాయించాలని ఆదేశించింది. త్వరలోనే అమరావతిలో ఈ టెక్నాలజీ సెంటర్‌కు పునాది పడబోతుంది.

మళ్లీ మిర్చి రైతులను మోసగించిన వ్యాపారులు

- కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యాలు, కమీషన్ వ్యాపారస్తులు కుమ్మక్కు
- రైతులకు బాండ్ పేపర్లు ఇచ్చి.. అదే స్టాకుపై వేరే పేర్లతో జారీ
- వాటిని బ్యాంకుల్లో ట్రైపార్టీ అగ్రిమెంట్ చేసి రూ.కోట్లలో రుణాలు
- బయట పడిన తర్వాత బోర్డు తిప్పేసి అదృశ్యం

గుంటూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చి కమీషన్, ఎక్స్‌పోర్టు, కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు మార్కెటింగ్, ఇతర చట్టాల్లోని లోపాలను అవకాశం చేసుకుని వారిని నమ్మిన రైతులను పదేపదే మోసగిస్తున్నారు. రైతుల మిర్చిని వారికి తెలియకుండానే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలానే బ్యాంకు అధికారులను ఏమారుస్తూ రూ. కోట్లలో రుణాలు తీసుకుంటూ ఎగ్గొడుతున్నారు. రెండు నెలల క్రితం బేతపూడికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరు కోల్డ్‌స్టోరేజ్ యజమానితో చేతులు కలిపి జీడీసీసీ బ్యాంకులో ఎవరెవరివో పేర్లు పెట్టి రూ.2 కోట్లకుపైగా రుణాలు తీసుకున్న మోసం బయటపడింది. దీనిపై జీడీసీసీ బ్యాంకు కొంతమేరకు రికవరీ చేసి మిగతా మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించేలా చర్యలు చేపట్టింది. అది మరువక ముందే ఇప్పుడు నల్లపాడు రోడ్డులోని సీతారామటౌన్‌షిప్ ఎదురుగా ఉన్న రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో మిర్చి టిక్కీలను రైతులకు తెలియకుండా విక్రయించిన ఉదంతం కలకలం రేకెత్తిస్తుంది.

నిబంధనలు.. లొసుగులు

గతేడాది మిర్చికి ధర లేకపోవడంతో వేల మంది రైతులు తమ పంటని కమీషన్ వ్యాపారస్తుల ద్వారా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం రైతు తీసుకొచ్చిన మిర్చి బస్తాలకు తొలుత కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం టీఆర్ (తాత్కాలిక రసీదు)ని జారీ చేస్తుంది. ఆ తర్వాత మూడు, నాలుగు రోజుల్లోనే ఫలాన రైతు తమ స్టోరేజ్‌లో మిర్చి బస్తాలను నిల్వ చేసుకున్నారని బాండ్ పేపర్‌ని జారీ చేస్తుంది. దానిపై స్టోరేజ్ యజమాని సంతకం ఉంటుంది. ఈ బాండ్ పేపర్ ఆధారంగా బ్యాంకులు రైతులతో ట్రైపార్టీ అగ్రిమెంట్ చేసుకొని ఏడాది కాల వ్యవధికి రుణాలు మంజూరు చేస్తాయి. బాండ్ పేపర్ బ్యాంకు వద్దనే ఉంటుంది. బాండ్ పేపర్ లేనిదే కోల్డ్‌స్టోరేజ్ యజమాని


రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజీలో మార్కెటింగ్, పోలీసు అధికారుల తనిఖీలు

ఆ స్టాకుని రిలీజ్ చేయడానికి వీల్లేదు. రైతు బ్యాంకు రుణాన్ని చెల్లించి బాండ్ పేపరు తెచ్చి ఇచ్చి ఆ స్టాకుని విక్రయించుకోవచ్చు. పైకి నిబంధన ఇలా కఠినంగా ఉన్నా దీనిలో ఎన్నో లొసుగులున్నాయి.

రూ. 2.80 కోట్ల మేర స్టాకు కన్పించడం లేదు

కమీషన్ వ్యాపారి, శీతల గిడ్డంగి యజమాని చేతులు కలిపితే రైతుల మిర్చికి భద్రత లేకుండా పోతుంది. నకిలీ బాండ్ పేపర్ పుస్తకాలను ముద్రించి వేరే రైతుల ఆధార్, పాన్ నంబర్లను పెట్టి గ్యారెంటీర్‌గా కోల్డ్‌స్టోరేజ్ యజమాని సంతకం చేస్తుండటంతో బ్యాంకులు ఇట్టే రుణాలు మంజూరు చేస్తున్నాయి. ముఖ్యంగా జీడీసీసీ నల్లపాడు బ్రాంచ్ ఇందుకు కేంద్ర బిందువుగా మారింది. ఆ బ్యాంకు 2023లో 129 బాండ్ పేపర్ల తనఖా పెట్టుకొని రూ.8 కోట్ల 77 లక్షల 33 వేలు మంజూరు చేసింది. వాటిల్లో కేవలం రూ. 4.32 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు వసూలు చేయగలిగింది. తాజాగా రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో 33 మంది రైతుల పేర్లతో తీసుకున్న రుణాలకు సంబంధించి స్టాకు కనిపించడం లేదని తేలింది. దీని విలువ రూ.2.80 కోట్ల వరకు ఉండొచ్చని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కాగా తమిళనాడు మర్కెంటైల్ బ్యాంకు కూడా ఈ నకిలీ బాండ్ పేపర్లను పెట్టుకొని రుణాలను మంజూరు చేసింది. ఆ బ్యాంకులో ఎంతమేరకు మోసం జరిగిందనే దానిపై లెక్కిస్తున్నారు.

జిల్లా కలెక్టర్‌కు జేడీ నివేదిక

రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్ ఉదంతంపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మార్కెటింగ్ కమిషనర్, జిల్లా ఎస్పీతో మాట్లాడటంతో



రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్ బయట రైతులు

ఉన్నత స్థాయిలో కదలిక వచ్చింది. మంగళవారం మార్కెటింగ్ శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, డీడీ ఝాన్సీరాణి, సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, యార్డు ఇన్‌ఛార్జ్ శ్రీకాంత్, నల్లపాడు సీఐ వంశీధర్ తదితరులు రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌కి చేరుకొని రికార్డులన్నింటిని వడపోత పట్టారు. మొత్తం 9,719 టిక్కీలను రాము అనే కమీషన్ వ్యాపారి కనుసన్నల్లో రైతుల పేర్లతో నిల్వ చేయగా వాటిల్లో 2,577 ఇప్పటికే అమ్మేశారు. మరో 2,849 బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకున్నారు. 4,293 బస్తాలు మాత్రం కోల్డ్‌స్టోరేజ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. దీనిపై సమగ్ర నివేదికని మార్కెటింగ్ జేడీ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి అందజేశారు. కోల్డ్‌స్టోరేజ్ యజమాని, కమీషన్ వ్యాపారిపై చీటింగ్, క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు.

రైతులు విధిగా బాండ్లు తీసుకోవాలి

కోల్డ్‌స్టోరేజీలలో రైతులు మిర్చి బస్తాలను నిల్వ చేసిన వెంటనే సంబంధిత యాజమాన్యం వద్ద బాండ్లను విధిగా తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆ బాండ్ పేపర్లను ఎవరికీ ఇవ్వకుండా రైతుల వద్దనే భద్రంగా ఉంచుకోవాలన్నారు. కొంతమంది రైతులు వ్యాపారస్తులను నమ్మి తమ బాండ్లను తీసుకోవడం లేదనీ, దీనివలన మోసాలు జరుగుతున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బాండ్లను వ్యాపారస్తుల వద్ద ఉంచొద్దన్నారు. వ్యాపారస్తుల వద్ద బాండ్లు ఉంటే వాళ్లు వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణాలు పొందే ప్రమాదం ఉందన్నారు. అలానే అమ్ముకోవడానికి కూడా ఆస్కారం ఉందని చెప్పారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- 38వ రోజు ప్రజాదర్బార్‌లో అర్జీదారులకు మంత్రి లోకేశ్ భరోసా

తాడేపల్లి, అక్టోబరు 1: ప్రజాదర్బార్‌లో 38వ రోజు పలువురు తమ సమస్యలను మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. పలువురు దివ్యాంగులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దు, అండగా ఉంటానని, సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని అర్జీదారులకు లోకేశ్ భరోసా ఇచ్చారు.

రూ.3 కోట్లతో పరారయ్యాడు..

గ్రామస్తుల నుంచి రూ.3 కోట్ల వరకు అప్పుగా తీసుకుని పరారైన గోరిజాల శ్రీనివాసరావును అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని పెదవడ్లపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి అన్నే చంద్రశేఖర్ మంత్రికి ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. పక్షవాతంతో బాధ పడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన అక్కల శివశంకరరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సంభవించిన వరదలకు తమ ఇళ్లలోకి నీరు చేరి సామగ్రి పూర్తిగా పాడైపోయాయని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మహానాడు ప్రాంత వాసులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందలేదని, విచారించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోజువారీ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న తాను ఇటీవల అనారోగ్యం బారినపడ్డానని భర్త కూడా లేని తనకు వితంతు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆత్మకూరు వడ్డెరపాలెంకు చెందిన వేముల సీతమ్మ కోరారు. పుట్టుకతో దివ్యాంగురాలినైన తాను ఇంటర్ వరకు చదువుకున్నానని ఇటీవల తన తల్లిదండ్రుల ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ జీవనం భారంగా


వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మారిందని ఆత్మకూరుకు చెందిన తమ్మిశెట్టి రాధాకీర్తి కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్యోగావకాశం కల్పిస్తే కుటుంబానికి అండగా ఉంటానని కోరారు.

కబ్జా చేశారు...

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కొనింపూడిలో తన తండ్రికి చెందిన 1.95 ఎకరాలను ఫోర్జరీ డాక్యుమెంట్లతో జి.నాగ వెంకట సత్యనారాయణ కబ్జా చేశారని న్యాయం చేయాలని కోరారు. వివిధ యూనివర్సిటీల్లో కాంట్రాక్టు, తాత్కాలిక అకడమిక్ కన్సల్టెంట్ విధానంలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసి రెగ్యులరైజ్ చేయాలని రాజమండ్రికి చెందిన అడ్‌హాక్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా కంభం మండలం కందులాపురంలో తన కుటుంబానికి చెందిన 1.09 ఎకరాల పట్టా భూమిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో గ్రామ కంఠంగా నమోదు చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని మార్కాపురంకు చెందిన రాచకొండ లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా కోటలోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ఉపాధ్యాయేతర సిబ్బందికి ట్రిబ్యునల్ తీర్పు అమలు చేయడంతోపాటు సర్వీసులో మరణించిన, రిలీవ్ చేసిన యూనియన్‌లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

అంబటి మురళిపై కేసు నమోదు

పొన్నూరుటౌన్, అక్టోబరు1: వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై వైసీపీ నాయకుడైన అంబటి మురళీకృష్ణ, మరో 12 మంది గత నెల 28వ తేదీన పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీసహస్రలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని స్వర్ణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు వ్యతిరేకంగా పూజలు నిర్వహించటమే కాకుండా రాజకీయ ప్రసంగాలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆలయం ముందు బైఠాయించిన వైసీపీ నాయకులు భక్తులను లోపలకు వెళ్లనివ్వకుండా ధర్నా నిర్వహించారు. దీనిపై పట్టణానికి చెందిన తోటకూర నరేష్ బాబు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పవిత్రమైన దేవాలయాన్ని నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాలకు వేదికగా మార్చటమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ధర్నాలు నిర్వహించారని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారించిన అర్బన్ పోలీసులు వైసీపీ నాయకులు అంబటి మురళీ కృష్ణ, షేక్ సైపుల్లా, షేక్ నాజర్, భవనం పద్మలీలా, అంబటి వెంకటేశ్వరరావు, గేర సంజీవ్, కందుల వెంకట సుబ్బారావు, నాగ ప్రసాద్, ఎందేటి వెంటక సుబ్బయ్య, మామిళ్లపల్లి మోహనరావు, దేవరపల్లి వినోద్, శ్రీరెడ్డి తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధరణికోట సమీపంలో బౌద్ధ శిల్పాలు లభ్యం


పొలంలో లభించిన రాతిమీద చెక్కిన శిల్పం, శాసనం

అమరావతి, అక్టోబరు 1: ధరణికోట గ్రామ రెవెన్యూ పరిధిలోని సాగుభూమిలో క్రీ.పూ 3వ శతాబ్దానికి చెందిన బౌద్ధ శిల్ప ఖండాలు మంగళవారం లభించాయి. గ్రామానికి చెందిన కొమ్మినేని పిచ్చియ్యకు చెందిన పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా పాలరాతి శిల్పఖండాలు బయటపడ్డాయి. సమాచారాన్ని పిచ్చియ్య కుమారుడు వెంకట్రావు రెవెన్యూ, పురావస్తుశాఖ అధికారులకు తెలియజేశారు. పురావస్తు శాఖ అధికారి అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ పర్యవేక్షణలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శిల్పాలను స్థానిక పురావస్తు సంగ్రహాలయానికి తరలించి భద్రపర్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సురేష్, మ్యూజియం సిబ్బంది శ్రీనివాస్, చినబాబు పాల్గొన్నారు. లభించిన శిల్పంపై గౌతమ బుద్ధుని తల్లి మాయాదేవికి చెలికత్తెలు సపర్యలు చేస్తున్న దృశ్యం చెక్కి ఉంది. దిగువన అప్పటి శాసనం ఉంది.

'దేవర' సక్సెస్ ఈవెంట్ నిర్వహణకు స్థల పరిశీలన



పెదకాకాని, అక్టోబర్ 1: దేవర సినిమా సక్సెస్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని మంగళవారం మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. నంబూరు అడ్డరోడ్డు సమీపంలోని విశాల ప్రాంతాన్ని ఆయన సందర్శించి, ఈవెంట్ నిర్వహణపై ఆర్గనైజర్లతో చర్చించారు. గతంలో గుంటూరు కారం సినిమా ఈవెంట్ జరిగినప్పుడు జరిగిన అపశ్రుతులను పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెదకాకాని సీఐ నారాయణస్వామి, ఎస్సై మేరాజ్, ఈవెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

రేపటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష

- జిల్లాలో నాలుగు కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 18,476మంది అభ్యర్థులు

గుంటూరు(విద్య),అక్టోబరు 1: జిల్లాలో రేపటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్షలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు మొత్తం 18,476 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు డీఈవో పి.శైలజ వెల్లడించారు. పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్ర పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు పరీక్షా కేంద్రాలకు రావాలని, 9.30 తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుతించమని స్పష్టం చేశారు. అదేవిధంగా సాయంత్రం 2 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు రావాలని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యేవారు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు పత్రంతో రావాలని సూచించారు.

నరసరావుపేటలో నాలుగు టెట్ పరీక్షా కేంద్రాలు


నరసరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో ఏపీ టెట్ పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. 3 నుంచి 21 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 9,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించుటకు ప్రతి సెంటర్‌లో పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజి, కోటప్పకొండ రోడ్డు, యల్లమంద, నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజి, అటానమస్ బ్లాక్-4, కోటప్పకొండ రోడ్డు, యల్లమంద, నరసరావుపేట. ఏ.ఎం.రెడ్డి మెమోరియల్ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, అట్లూరి మస్తాన్ రెడ్డి నగర్, పెట్లూరి వారి పాలెం, నరసరావుపేట, ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ, కేసానుపల్లి నరసరావుపేట. విద్యాశాఖ అధికారి వారి కార్యాలయం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. అభ్యర్థుల సందేహాల నివృతికి ఈ కింది నంబర్లను సంప్రదించాలని డీఈవో సూచించారు. కె. ప్రసాద్ బాబు, సూపరింటెండెంట్ 9704494654, వై.తిరుపతి రావు, జూనియర్ అసిస్టెంట్, 9177020977, జి.జీవరత్నం 9866904960, పి.శంకర్ రాజు 9963192487లో సంప్రదించాలని వివరించారు.

వైసీపీ నాయకులు పద్ధతులు మార్చుకోవాలి

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


పిడుగురాళ్ల, అక్టోబరు 1: వైసీపీ నేతలు ఇకనైనా తమ పద్ధతులు మార్చుకోవాలని, రెచ్చగొట్టే ధోరణిని విడనాడాలని, దాడులకు పాల్పడితే టేకేర్‌ఫుల్...అంటూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వైసీపీ నేతలను హెచ్చరించారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలకే వైసీపీ నేతలు బరితెగింపునకు పాల్పడుతున్నారని, తురకపాలెం మాజీ సర్పంచ్‌పై దాడి చేయడమే కాకుండా ఇటీవల రేగులగడ్డలో కానిస్టేబుల్‌పై కూడా వైసీపీ నేతలు దాడికి పాల్పడటం వెనుక వైసీపీ నేతల రెచ్చగొట్టే విధానం కనిపిస్తుందన్నారు. ఇకనైనా వైసీపీ నేతలు పద్ధతులు మార్చుకొని జీవించాలంటూ తీవ్రంగా హెచ్చరించారు. 2014-19 మధ్యకాలంలో గురజాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే తప్ప 2019-24 మధ్య వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమీలేదని, 2019-24 మధ్యకాలంలో అక్రమ మైనింగ్‌తో 8 మంది చిన్నారులు, 11 మంది టీడీపీ కార్యకర్తల హత్యకు గురయ్యారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతుందని, ఇంకా కొందరు వైసీపీ నేతలు తమ ప్రభుత్వంలో సాగించిన అరాచకాలనే సాగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఎన్నికలకు ముందు నేను చెప్పినట్లుగా యరపతినేని శ్రీనివాసరావుగానే చూడాలని, మంచికల్లు శ్రీనుగా చూడొద్దన్నారు. డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, పిల్లి చెన్నారావు, పణితి రవి, మందా డేవిడ్, దూదేకుల ఖాశింసైదా, వేముల ఆంజనేయులు, బత్తుల శ్రీను, ముప్పాళ్ల సాంబయ్య, సురేష్, ఎల్‌వీఆర్, కమిషనర్ శ్రీధర్ ఉన్నారు.

ప్రపంచం గర్వించదగిన తత్వవేత్త సచ్చిదానంద మూర్తి


సచ్చిదానందమూర్తి కుటుంబ సభ్యుల్ని సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య),అక్టోబరు 1:ప్రపంచం గర్వించదగిన తత్వవేత్తగా ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి ఎనలేని ఖ్యాతి గడించారని మాజీ రాజ్యసభ సభ్యులు, విశ్వ హిందీ పరిషత్ నేషనల్ ప్రెసిడెంట్ వై.లక్ష్మీప్రసాద్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్‌టీఆర్ విజ్ఞాన్ లైబ్రరీ, స్కూల్ ఆఫ్ అప్లయిడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ చదువులో ఉన్న మర్మాన్ని గ్రహించారు కనుకే కొత్త సచ్చిదానంద మూర్తి గొప్ప తత్వవేత్తగా ఎదిగారని అన్నారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ మాజీ హెడ్, ప్రొఫెసర్ సాంబశివ ప్రసాద్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ కొత్త రమేష్, రావెల సాంబశివరావు, డాక్టర్ సి.వెంకటాచలం, డాక్టర్ పి.సుబ్బారావు, సచ్చిదానంద మూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెపక్ తక్రా పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 1 : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పెద మక్కెన జెడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్కూల్ గేమ్స్ 68వ చెపక్ తక్రా రాష్ట్ర స్థాయి పోటీలను ఎమ్మెల్యే కన్నా మంగళవారం ప్రారంభించి ప్రసంగించారు. పోటీల్లో సెమీస్‌కు చేరిన జట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కర్నూలు జట్టు పై కడప, నెల్లూరు జట్టు పై గుంటూరు జట్టు, అనంతపురం జట్టుపై ప్రకాశం, విజయనగరంపై పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరగా బాలికల విభాగంలో నెల్లూరుపై అనంతపురం జట్టు, కడప పై కర్నూలు, గుంటూరుపై పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించాయి. చెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకులు మారుతీ ప్రసాదు, అండర్ - 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన : ఎమ్మెల్యే ప్రవీణ్



కంభంపాడులో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని కంభంపాడు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ భరోసా పించన్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో నియంత పాలనను కూల్చివేసి ఉత్తమ నాయకుడు చంద్రబాబును ప్రజలు ఎన్నుకున్నార న్నారు. రాష్ట్రానికి అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి వచ్చారని, వైసీపీ ప్రభుత్వ పాలనలో చేసిన అరాచకాలను, అప్పులను సరిదిద్దుకుంటూ అమరావతిని, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగానే పింఛన్‌ను రూ.4వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నేతలు మాదినేని వెంకట సుబ్బయ్య, మాజీ ఎంపీపీ బీ రామగోపాలరావు, మండల టీడీపీ నేతలు ఏ వెంకటేశ్వర్లు, దగ్గుపాటి శ్రీనివాసరావు, మాదినేని వెంకటరావు, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి పూర్ణచంద్రరరావు, వెంకటకృష్ణ, కోండ్రు పద్మలత తదితరులు పాల్గొన్నారు.

గురజాల సెబ్ సీఐగా బుజ్జిబాబు



గురజాలటౌన్, అక్టోబరు 1: గురజాల సెబ్ సీఐగా బుజ్జిబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నరసరావుపేట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మద్యం అక్రమం గా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే నూతన మద్యం పాలసీలో భాగంగా ఈనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. గురజాల సెబ్‌స్టేషన్ పరిధిలోని రెంటచింతల, గురజాల, దాచేపల్లి మండలాల పరిధిలో 15 మద్యం షాపులున్నాయన్నారు. దరఖాస్తుదారులు డీడీలు తీసి వివరాలను సెబ్‌స్టేషన్లో అందించాలన్నారు. ఈనెల 11వ తేదీన లాటరీ ఉంటుందని, మరుసటి రోజు నుంచి షాపులు మొదలవుతాయని అన్నారు. ఏమైనా సందేహాలుంటే సెబ్‌స్టేషన్లో సంప్రదించాలన్నారు. సెబ్ ఎస్ఐగా ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

ఎన్ఎస్ ప్రాజెక్ట్ క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా హిమబిందు



మాచర్ల రూరల్, అక్టోబరు 1: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా బి.హిమబిందు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలో క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన కేవీ కోటేశ్వరరావు మాచర్ల డిజైన్స్‌కు బదిలీ అయ్యారు. అలాగే మెయిన్ కెనాల్ మోనిటరింగ్ ఏఈఈగా వెంకటసుబ్బయ్య, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈగా అనితలు బాధ్యతలు చేపట్టారు. వాటర్ సప్లై ఏఈఈగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ దుగ్గిరాలకు, మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈగా విధులు నిర్వహించిన యుగంధర్ వినుకొండకు, గేట్స్ ఏఈఈగా విధులు నిర్వహించిన బాబుమియా నెల్లూరులోని సోమశిలకు బదిలీ అయ్యారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఏజీపీ

మాచర్లటౌన్, అక్టోబరు 1: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు (జీవీ) అన్నారు. మంగళవారం సీనియర్ సిటిజన్స్ డే ను పురస్కరించుకొని పట్టణంలోని వృద్ధాశ్రమంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై ఏజీపీ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జే నాగేశ్వరరావు, వీడెల పుల్లారావు, జీ వరప్రసాద్, పీ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం రవాణా కేసులో ఇద్దరి అరెస్టు

రెంటచింతల, అక్టోబరు 1 : తెలంగాణ మద్యాన్ని తీసుకుని పాలువాయి జంక్షన్‌కు వస్తున్న క్రమంలో పోలీసులను చూసి మద్యాన్ని వదిలేసి పారిపోయిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. జెట్టిపాలెం గ్రామానికి చెందిన కామనబోయిన బ్రహ్మయ్య, అంబటి లక్ష్మీనారాయణలు ఆగస్టు 22న మద్యం తీసుకొని పాలువాయి జంక్షన్‌కు వస్తూ పోలీసులను చూసి పారిపోయారు. వారిని మంగళవారం అరెస్టు చేసి గురజాల కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో బెంబేలెత్తుతున్న రైతులు

దుర్గి, అక్టోబరు 1: వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు చోరీ చేస్తుండడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని ముటుకూరులో సోమవారం రాత్రి టీడీపీ సీనియర్ నేత లింగా బ్రహ్మయ్య పొలంలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఆరు నెలల్లో మంటి కోటయ్య, మరికొంత పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. దీంతో పొలాలకు నీరు పెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నామని, పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీలను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. చోరీలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

ఉప ముఖ్యమంత్రి పిలుపుతో ఆలయాల్లో పూజలు

కారంపూడి, అక్టోబరు 1: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు కూటమి నేతలు మంగళవారం మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలోని తెలగవారి వీధిలో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి దీపారాధన నిర్వహించారు. అలాగే గాదెవారిపల్లెలోని వేంకటేశ్వరస్వామి దీపారాధన చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షుడు అలిచెట్టి చొజ్జయ్య బద్రి, కూటమి నేతలు పాల్గొన్నారు.

దుర్గి, అక్టోబరు 1: తిరుపతి లడ్డులో కల్తీ జరగడంతో పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్తం దీక్ష చేపట్టడంతో కూటమి మండల నేతలు మద్దతుగా నిలిచారు. మండలంలోని ధర్మవరం, దుర్గిలలో దేవాలయాలను శుద్ధి చేశారు. ఆలయాల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమంలో పులి హరి, రుద్రాల రవి, కటకం రామారావు, వెలిదండి శ్రీనివాసరావు, కటకం భావన్నారాయణ, సూరె కృష్ణ పాల్గొన్నారు.

వీఆర్‌వో కనపడటం లేదని ఫిర్యాదు

ముప్పాళ్ళ, అక్టోబరు 1 : మండలంలోని పలు దేవర్లపాడు గ్రామానికి చెందిన సత్తెనపల్లి మల్లికార్జునరావు నార్నెపాడు సచివాలయంలో వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 30వ తేదీన ఉద్యోగానికి వెళ్లి ఇంటికి రాలేదు. తల్లి నాగేంద్రమ్మ, కుటుంబసభ్యులు అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో నాగేంద్రమ్మ మంగళవారం ముప్పాళ్ళ పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు కన్పించడం లేదంటూ ఫిర్యాదు చేసింది. వీఆర్‌వో మల్లికార్జునరావు ఐదు సంవత్సరాలుగా నార్నెపాడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి ఇష్టం లేని వివాహం చేయటం, ఇటీవల సొంతంగా పెట్టిన వ్యాపారంలో నష్టం రావటంతో కన్పించకుండా పోయినట్లు సమాచారం. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పరిశీలిస్తున్నట్టు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

క్రోసూరు, అక్టోబరు 1 : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అవులవారిపాలెం, పెరిక పాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మాగాణి పంటలను సందర్శించి రైతులకు సూచనలు చేశారు.

గంగవరం, పులిపాడులలో

గురజాలటౌన్, అక్టోబరు 1: మండలంలోని గంగవరం, పులిపాడు గ్రామాల్లో మంగళవారం ఏవో సంధ్యారాణి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సంధ్యారాణి ఆయా గ్రామాల్లో పత్తి పొలాలను పరిశీలించి రైతులకు మేలైన, నూతన యాజమాన్య పద్ధతులను వివరించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ అనిల్, శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



వృద్ధుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, అక్టోబరు 1: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాల పరిధిలో ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అందించిన పథకాలను సద్వినియోగించుకోవాలన్నారు. హెచ్‌ఎం అనంత శివ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరిలో బాలురు 12 మంది, బాలికలు 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ నెలాఖరుకు తమ పాఠశాలలోనే రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బాలూనాయక్, ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు భద్రారెడ్డి, కార్యదర్శి పుల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి స్వర్ణరాజు, పల్నాడు జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సురేష్, పీఈటీలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అనంతరం రెయిన్‌బో పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు ఎమ్మెల్యే అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, బిస్కెట్స్ ప్యాకెట్లను ఎమ్మెల్యే అందించారు. అలాగే వాసవీ క్లబ్ మొక్కల పెంపకానికి తయారు చేయించిన సీడ్స్ బాల్స్‌ను పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి)కి అందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పొట్టి హనుమంతురావు, జిల్లా గవర్నర్ కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ప్రసాదరావు, వైస్ గవర్నర్ భవిరిశెట్టి రామారావు, ఉపాధ్యాయులు, కూటమి నేతలు, ఆర్యవైశ్య సంఘీయులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రల బకాయిలు చెల్లించాలి

కారంపూడి, అక్టోబరు 1: క్లాప్ మిత్రల జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పేటసన్నిగండ్ల, ఒప్పిచర్ల, కొదమగుండ్ల, చినగార్లపాడు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే క్లాప్ మిత్రలను సన్మానించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు క్లాప్ మిత్రలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ బూసిరెడ్డి, ఏవో శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను

కారంపూడి, అక్టోబరు 1: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామ ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పింఛను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల గృహాల వద్దకు వెళ్లి పింఛను అందిస్తున్నట్లు చెప్పారు. ఒకటో తేదీనే పింఛను ఇంటి వద్దకు వస్తుండటంతో వృద్ధులు, దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, మాజీ ఉప ఎంపీపీలు చావా వీరాంజనేయులు, పంగులూరి పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు చప్పిడి రాము, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, ఎంపీటీసీ గాడిపర్తి పూర్ణయ్య, గోళ్ల సురేష్ యాదవ్, తెలుగుయువత మండల అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

● ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరించాలి : ఎమ్మెల్యే కన్నా



పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 1: అధికారులెవ్వరూ ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని, ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెదమక్కెన జడ్పీ హైస్కూల్లో మంగళవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో ఎమ్మెల్యే కన్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోసం మీ వద్దకు వచ్చే ప్రజలను పదే పదే మీ చుట్టూ తిప్పుకోవద్దని, సమస్య పరిష్కారం అవుతుందో లేదో, ఎందుకు కాదో వివరించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ సందర్భంగా పింఛన్‌లు కావాలని, బీసీ కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని, ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, కాలనీల్లో డ్రెయినేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసు కువచ్చారు. జల జీవన్ మిషన్ కింద గ్రామంలో ప్రధాన రహదారి మధ్యలో పైపులైన్ కోసం గోతులు తవ్వారని, కొన్ని చోట్ల పైపులైన్ వేయక పోగా మరి కొన్నిచోట్ల పైపులైన్‌లు గోతులు పూడ్చక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవటంతో ఏఈపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని అన్నారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు, ఈకేనగర్‌లోని ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించే కాంపౌండ్ వాల్‌కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

లబ్ధిదారుల్లో చెప్పలేనంత సంతోషం

గత ప్రభుత్వం కంటే మెరుగ్గా పింఛన్ల పంపిణీ చేస్తున్నామని, దీంతో లబ్ధిదారుల్లో చెప్పలేనంత సంతోషం నెలకొందని ఎమ్మెల్యే కన్నా అన్నారు. గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉదయాన్నే 6గంటల కల్లా సంబంధిత అధికారులు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు ఎమ్మెల్యే కు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మండపు అన్నపూర్ణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, జనసేన నియోజవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటప్పారావు, టీడీపీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, ఎలినేడి రామస్వామి, సంధ్య, విజయలక్ష్మి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష రూపాయలు అందజేత

సత్తెనపల్లి, అక్టోబరు 1 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాజుపాలెం మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు అన్న క్యాంటీన్ నిర్వాహణకు ఇచ్చి న లక్ష విరాళాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ షమ్మీకి కన్నా అందించారు.

వరద బాధితుల కోసం రూ.25వేలు

వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని రాఘవేంద్ర బాలకుటీర్, వాసవీ కన్యకా పరమేశ్వరి జూనియర్ కళాశాల నిర్వాహకులు మంగళవారం రూ.25వేలు చెక్కును ఎమ్మెల్యే కన్నాకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పై వైసీపీ దాడి

● మాజీ సర్పంచ్, భార్యపై దాడి
● చికిత్స పొందుతున్న మాలాంబీ



చిరిగిన దుస్తులతో మాజీ సర్పంచ్ మాబూవలి

మాచవరం, అక్టోబరు 1 : టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దాడిచేసి గాయపరిచిన ఘటన మండలంలోని తురకపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. దీనికి సంబంధించి సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు షేక్ మహమ్మద్ రఫీ తన కున్న షాపులను శుభ్ర పరుచుకుంటున్నాడు. అదే సమయంలో మాజీ సర్పంచ్ మాబూవలి తమ్ముడు మాబూ సుభానీ రఫీ వద్దకు వెళ్లి గతంలో నా మీద అక్రమ కేసులు పెట్టారంటూ ప్రశ్నించాడు. దీంతో రఫీ తనపై గొడవ పడ్డాడు. ఇది తెలుసుకున్న మాజీ సర్పంచ్ మాబూ వలి, అతని భార్య మాలాంబీలు ఘటనా స్థలానికి వెళ్లారు. జరిగిన విషయాన్ని తెలుసుకున్న క్రమంలోనే రఫీ, సర్పంచ్ అల్లా భక్షులు మాబూ వలిపై, అతని భార్య మాలాంబీపై, మాబూ సుభానీపై దాడికి పాల్పడ్డారు. మాజీ సర్పంచ్ దుస్తులు చింపటమే కాకుండా కొట్టారు. మాలాంబీని రఫీ కాలుతో కడుపులో తన్నగా ఆమె పడి పోయి స్పృహ కోల్పోయింది. ఆమెకు గ్రామంలో ప్రథమ చికిత్స చేయించి పిడుగురాళ్ళ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కడుపులో కాలుతో తన్నటంతో రక్తస్రావం అయినట్టు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీ సులు తురకపాలెం గ్రామం చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. రఫీని, అల్లాభక్షును పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాచేపల్లి సీఐ వెంకటరావు, మాచవరం ఎస్ఐ సతీష్, దాచేపల్లి ఎస్ఐలు శివనాగరాజు, పాపారావులు సిబ్బందితో గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలో లేనప్పటికీ వైసీపీ నాయకులు చేస్తున్న ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారం ఉండి ఉంటే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఇక ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టేవారోనని జరిగిన సంఘటన బట్టి అర్థమవుతుంది. మాబూవలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

హెచ్‌ఎం శివ సస్పెన్షన్

కారంపూడి, అక్టోబరు 1: కారంపూడి బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం అనంత శివ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆర్జేడీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల కలెక్టర్ అరుణబాబు ఈ హైస్కూల్‌ను సందర్శించారు. ఆ సమయంలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణలో అవకతవకలు గుర్తించారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ రైస్ వండించడం, విద్యార్థుల హాజరుశాతంపై కలెక్టర్ అరుణ్‌బాబు అడిగిన ప్రశ్నలకు హెచ్‌ఎం అనంత శివ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఈ మేరకు హెచ్‌ఎం అనంత శివ సస్పెన్షన్‌కు గురయ్యారు.

టీడీపీ వర్గీయులపై దాడి

బెల్లంకొండ, అక్టోబరు 1 : టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకులు దాడి చేసి ఇద్దరిని గాయపరిచిన ఘటన మండలంలోని యమ్మాజీగూడెంలో సోమవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనలో టీడీపీకి చెందిన సంపత్‌కుమార్, చిట్టిమాల మల్లేశ్వరిలకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. యమ్మాజీగూడెంలో నాలుగు రోజుల నుంచి చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. దానిలో భాగంగానే అర్ధరాత్రి ఎవ్వరూ లేని సమయంలో ఇద్దరు ఇళ్లపై దాడి చేసి గాయపరిచినట్టు పేర్కొన్నారు. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపసర్పంచ్ పదవికి సుభానీ రాజీనామా

బెల్లంకొండ, అక్టోబరు 1 : బెల్లంకొండ ఉపసర్పంచ్ మునగపాటి సుభానీ ఉపసర్పంచ్ పదవికి మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో హనిమిరెడ్డికి అందజేసినట్టు పేర్కొన్నారు. తన వ్యక్తి గత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

రైల్లో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

దాచేపల్లి, అక్టోబరు 1: రైల్లో ప్రయాణం చేస్తున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన మంగళవారం నడికూడి రైల్వే జంక్షన్‌లో జరిగింది. మృతుడు తూర్పు గోదావరికి చెందిన పిట్టా రమణ (45)గా గుర్తించారు. భార్య, కుమారుడితో కలిసి మృతుడు రమణ లోకమాన్య తిలక్ (ముంబై టూ విశాఖ - ఎల్‌టీటీ) రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. మధ్యాహ్నం రైలు నడికూడి రైల్వేస్టేషన్‌కు చేరుకునే సమయానికి పిట్టా రమణ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. జీఆర్‌పీ పోలీసుల సాయంతో 108లో వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అంకమ్మతల్లికి బంగారపు ముక్కుపుడక



అంకమ్మతల్లికి ముక్కుపుడకను అందజేస్తున్న పవన్‌కుమార్‌శర్మ దంపతులు

దాచేపల్లి, అక్టోబరు 1: దాచేపల్లిలోని శ్రీవీర్ల అంకమ్మతల్లికి బంగారపు ముక్కుపుడకను మందాది పవన్‌కుమార్‌శర్మ దంపతులు అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యలమల నరేష్ అమ్మవారికి పట్టుచీర, 50 వేల రూపాయల విలువైన బంగారపు ముక్కు పుడకను అందజేశారు.

అచ్చంపేటలో పింఛన్ల పంపిణీ

అచ్చంపేట, అక్టోబరు 1: అచ్చంపేటలో మంగళవారం పింఛన్ల పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అచ్చం పేటలోని 52, 58వ బూత్‌లో టీడీపీకి చెందిన మండల బీసీ నాయకులు తిరు వాయిపాటి ఆంజనేయులు, సందెపోగు సామేలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కోనూరులో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి పీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్, అక్టోబరు 1: పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు పంపిణీ చేశారు. మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

దుర్గి, అక్టోబరు 1: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పెన్షన్ల పంపిణీ నిర్వహించారు. దుర్గి, ధర్మవరం, ముటుకూరు, అడిగొప్పుల గ్రామాల్లో స్పెషలాఫీసర్ వీసీహెచ్ రామాంజనేయులు పెన్షన్లను పంపిణీ చేశారు. త్వరితగతిన పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

జడ్పీ హైస్కూల్‌కు ప్రజాప్రతినిధుల చిత్రపటాలు

మాచవరం, అక్టోబరు 1: మండలంలోని మోర్జంపాడు జడ్పీ హైస్కూల్‌కు ప్రజా ప్రతినిధుల చిత్రపటాలను టీడీపీ నాయకులు మంగళవారం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని చిత్రపటాలను పాఠశాలకు అందజేశారు.

1వ తేదీనే పింఛన్ల పంపిణీ కూటమికే సాధ్యం

● ఎమ్మెల్యే యరపతినేని



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, అక్టోబరు 1 : రాష్ట్రంలో లక్షలాది మంది పించనుదారులకు 1వ తేదీనే పించను పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పిడుగురాళ్లలో పలు వార్డులకు సంబంధించి అబ్ధిదారులకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పింఛన్లను అందజేశారు. దివ్యాంగులకు, పింఛన్‌దారులకు 1వ తేదీనే ఇంటివద్దకు అధికారులు వెళ్లి పింఛన్ అందజేస్తున్నట్లు, సాయంత్రానికే 99శాతం పింఛన్లను పూర్తి చేస్తున్నారన్నారు. అదే విధంగా పురపాలక సంఘం పరిధిలో కమిషనర్ శ్రీధర్, రూరల్‌లో గండికోట వెంకటేశ్వర్లు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, మందా డేవిడ్, సయ్యద్ అమీర్‌అలితో పాటు పలువురు నేతలు పింఛన్లు అందజేశారు.

ప్రభుత్వ ఖాజీగా అబ్దుల్ కరీం

పిడుగురాళ్ల, అక్టోబరు 1: పిడుగురాళ్ల పట్టణ, మండల ప్రభుత్వ ఖాజీగా షేక్ మౌలానా అబ్దుల్ కరీం నియమితులయ్యారు. మంగళవారం పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కరీంకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, టీడీపీ నేతలు బాషా, షేక్ సైదా, ఫరీద్ మేస్త్రీ, షేక్ ఖాశిం, సలీం, ముజీబ్, సయ్యద్ ఇర్షాద్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు, దివ్యాంగులకు చేయూతనిస్తున్న పింఛన్లు

కలెక్టర్ అరుణ్‌బాబు



దివ్యాంగురాలికి పింఛన్‌ను అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నకరికల్లు, అక్టోబరు 1: అల్పాదాయ వర్గాలకు చెందిన వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఆర్థికంగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు చేయూతనిస్తున్నట్లు కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. గ్రామానికి చెందిన కట్ల అశ్వనికి పింఛను అందజేశారు. ఆమె దివ్యాంగత్వానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూ.15వేల ఆర్థిక ప్రయోజనం చేకూరే పింఛన్‌ను అశ్వనీకి ఇవ్వాలని కుటుంబసభ్యులు కోరారు. నూతన పింఛన్ల పంపిణీ ప్రారంభమయ్యే సమయంలో అశ్వనికి ఆ పింఛన్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మరో పెన్షనర్ అద్దంకి వీరాస్వామికి పింఛను అందించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎల్‌డీవో వై రాజగోపాల్, తహసీల్దార్ కే పుల్లారావు, ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పింఛను పెంపుతో వృద్ధుల్లో ఆనందం : యరపతినేని నిఖిల్



పింఛన్ పంపిణీ చేస్తున్న నిఖిల్

గురజాలటౌన్, అక్టోబరు 1: ఎన్టీఆర్ భరోసా పించను పెంపుతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు జీవితాల్లో ఆనందం వెల్లివిరిసిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ అన్నారు. మంగళవారం మండలంలోని పల్లెగుంత గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

మస్తాన్‌వలి కుటుంబాన్ని పరామర్శించిన నిఖిల్

మండలంలోని పల్లెగుంత గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ మస్తాన్ వలి కుమారుడు బాషా ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యరపతినేని నిఖిల్ మంగళవారం మస్తాన్‌వలి గృహానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉండి ఆదుకుంటామని భరోసానిచ్చారు.

వైసీపీ సర్పంచ్‌ని టీడీపీలో చేర్చుకోవటంపై అభ్యంతరం

నకరికల్లు, అక్టోబరు 1: కుంకలగుంట సర్పంచ్ సుంకర మరియమ్మ, భర్త మత్తయ్యలను సోమవారం వైసీపీని వీడి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కన్నా సమక్షంలో టీడీపీ చేరారు. ఎన్నికల సమయంలో మత్తయ్య టీడీపీకి చెందిన తమపై దాడులకు పాల్పడేందుకు యత్నించారని, తమను ఇబ్బందిపెట్టారని కుంకలగుంట ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నేతలు పేర్కొన్నారు. పార్టీ కోసం పని చేసే మాతో సంప్రదించకుండా వైసీపీకి చెందిన సర్పంచ్‌ని పార్టీలో చేర్చుకోవటంపై అభ్యంతరం తెలిపారు. కుంకలగుంట గ్రామ పంచాయతీకి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జెట్టి కటాక్షం మాట్లాడుతూ తాను ఓడి పోవటానికి టీడీపీలోని కొందరు నేతలే కారణమని ఆరోపించారు. పార్టీ అభ్యర్థిగా ఉన్న తనను సంప్రదించకుండా నాపై గెలిచిన సర్పంచ్ దంపతులను టీడీపీ చేర్పించిన నలుగురు నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీలో చేరిన వారిని సస్పెండ్ చేయాలని, లేదంటే తాము రాజీనామా చేస్తామని పెట్రోల్ సీసాలతో నిరసన వ్యక్తం చేశారు.

అగ్నిమాపక కేంద్రం ఔట్ పోస్టు ప్రారంభం

● జిల్లా అధికారి ఎస్ శ్రీధర్

క్రోసూరు, అక్టోబరు 1: అగ్నిమాపక కేంద్రాల సేవలను ప్రజలకు చేరువ చేసేందుకే క్రోసూరులో ఔట్ పోస్టును పునఃప్రారంభిస్తున్నామని జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్ శ్రీధర్ అన్నారు. మంగళవారం క్రోసూరులో అగ్నిమాపక కేంద్రం ఔట్ పోస్టును ఆయన ప్రారంభించారు. జిల్లాలో ఏడు అగ్నిమాపక కేంద్రాలున్నాయని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో క్రోసూరులో మాత్రమే ఔట్ పోస్టును ప్రారంభించామన్నారు. క్రోసూరు అగ్నిమాపక సేవలు కేంద్రం వద్ద నుంచి ఎటు చూసినా 20 కిలో మీటర్లు పరిధి వరకు అందజేస్తామన్నారు. క్రోసూరు మండలంలో పీసపాడు వరకు, బెల్లంకొండ మండలంలో మాచాయపాలెం వరకు, అచ్చంపేట మండలంలో మాదిపాడు వరకు, అమరావతి మండలంలో అత్తలూరు వరకు ఔట్ పోస్టు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్వీస్ ప్రొవైడర్ ప్రసాదుతో పాటు ఎస్ఎఫ్‌వో బీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది: డాక్టర్ చిన్నమ్మ

రెంటచింతల, అక్టోబరు 1: ప్రపంచ వ్యాప్తంగా సైన్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందని దానిని విద్యార్థులు చిన్ననాటి నుంచే గుర్తించి వివిధ రకాల పోటీ పరీక్షల్లో పాల్గొని తమలో దాగిన నైపుణ్యాన్ని వెలికి తీయడానికి కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా నేత డాక్టర్ చిన్నమ్మ కోరారు. మంగళవారం సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాల బాలికలకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

పత్తిలో మెగ్నీషియం లోపం : ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, అక్టోబరు 1: పత్తి పంటలో మెగ్నీషియం లోపం కనవడుతుందని, దీని నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ ఎకరానికి 10 కేజీల చొప్పున చల్లుకోవాలని పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పిల్లుట్ల, సంగరాయపాలెం తండా గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే రామమ్మ, నరసింహా నాయక్, యాకోబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

దాచేపల్లి, అక్టోబరు 1: రైతులు తమ పంట పొలాలకు భూసార పరీక్షలు చేయించుకోవాలని దాచేపల్లి వ్యవసాయశాఖ అధికారి పాపకుమారి మంగళవారం రైతులకు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రామాపురం, పొందుగల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రైతులు విత్తనాలు విత్తేముందు శుద్ధి చేసుకోవాలని సూచించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పింఛన్‌ల పంపిణీ 96.28 శాతం

● పర్యవేక్షించిన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పింఛన్‌ను ఠంచన్‌గా పంపిణీ చేస్తున్నారు. తెలవారుతుండగానే లబ్ధిదారుడి ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్లు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 5 గంటలకు పింఛన్‌ల పంపిణీ ప్రారంభించారు. సచివాలయ, ఇతర ఉద్యోగులు పింఛన్‌ల పంపిణీలో భాగస్వామలయ్యారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్‌ల పంపిణీని కలెక్టర్ అరుణ్‌బాబు పర్యవేక్షించారు. నకరికల్లు మండలం రూపెనగుంట్లలో కలెక్టర్ అరుణ్‌బాబు పింఛన్‌లు పంపిణీ చేశారు. ఒక్క రోజులోనే 96.28శాతం పంపిణీ జరిగింది జిల్లాలో 2,76,149 మంది పింఛన్‌దారులు ఉండగా సాయంత్రం ఐదు గంటలకు 2,65,889మందికి పింఛన్ పంపిణీచేశారు. పింఛన్‌దారులకు రూ.113.46కోట్ల నగదు పంపిణీ చేశారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నల్లపాటి చిన్నబ్బాయి, కనుమూరి లక్ష్మి తదితరులు

ఎన్ని ఇబ్బందులు ఉన్నా 1వ తేదీనే పింఛన్లు

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 1: రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ఒకటో తారీకునే పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం తెల్లవారుజామునే అవ్వాతాతలను పలకరించుకుంటూ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లపాటి చిన్నబ్బాయి, కనుమూరి లక్ష్మి, యలమంద, రావిళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేటలోని 8వ వార్డులో సామాజిక పింఛన్ల పంపిణీలో టూ టౌన్ డ్వాక్రా సంఘం అధ్యక్షరాలు షేక్ అఖిల, టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

నరసరావుపేటలో విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 1: విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం గాంధీ పార్కువద్ద మంగళవారం నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కార్మికులను విధులలోకి తీసుకోవాలని, స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఫిట్‌నెస్ పేరిట కార్మికులను అక్రమంగా తొలగించటం మానుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చిన రైతుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం అధ్యక్షుడు కామినేని రామారావు, డీ శివకుమారి, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి జీ మల్లేశ్వరి, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. విజయకుమార్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ నాసరయ్య తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 1: పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా నైపుణ్యత, విలువలు పెంపొందించుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాలలో ప్రతిభ చాటిన వారికి, వివిధ ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. సినీ యాంకర్ అండ్ గాయని స్నిగ్ధ, గాయకుడు ఉదయ్, వాఖ్యత అను, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య కే వీరరాఘవులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి గుడిలో ప్రాయశ్చిత్త దీక్ష

నరసరావుపేట టౌన్, అక్టోబరు 1: నరసరావుపేట పట్టణంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం కోటప్పకొండ రోడ్డులోని శ్రీనివాస్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి గుడిలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా ఓం నమో నారాయణ మంత్ర పఠనం, పూజ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాదు, ఉపాధ్యక్షుడు మేడిశెట్టి రామారావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, చుండూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అహింస ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులు

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మహాత్మాగాంధీకి నివాళి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 1: స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మహాత్మాగాంధీ 155వ జయంతిని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు నేటి ప్రపంచంలో అహింసాశక్తి అనే అంశంపై వ్యాస రచన, ఆధునిక ప్రపంచంలో సామాజిక మార్పుకోసం అహింస ఒక ప్రభావవంతమైన సాధనమా? అనే అంశంపై డిబేట్ నిర్వహించారు. పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఆట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మహాత్మాగాంధీ జీవితం, త్యాగాలు, అచంచలమైన అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. చివరిగా విద్యార్థులతో అహింస ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో విదేశీ విద్యపై అవగాహన



అవగాహన సదస్సులో లియో గ్లోబల్ ఓవర్సీస్ ప్రతినిధులు, విద్యార్థులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 1: స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో లియో గ్లోబల్ ఓవర్సీస్ సహకారంతో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు విదేశీ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. విదేశీ విద్య అభ్యసించటానికి కావాల్సిన వీసా, అడ్మిషన్ల ప్రక్రియ, అడ్మిషన్ పొందిన తర్వాత అక్కడ ఉన్న ఆదాయపు వనరుల విధి విధానాల గురించి స్పాట్ అసెస్మెంట్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే ప్రసన్న లక్ష్మి, అడ్వైజర్స్ జీ అభయ్, ఎం.హరికృష్ణ, ఏ దీప్తి, బీ శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ షేక్ నజీమా తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

ఎన్ఈసీలో రక్తదాన శిబిరం

నరసరావుపేట కల్చరల్, అక్టోబర్, 1. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థులు రక్తదానం చేశారని కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వర్లు, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు జానకి రామయ్య, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ నవ్య, ఎన్ఎస్ఎస్ అధికారి ఐ.శ్రీధర్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్

నరసరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల సవరణ నిర్ణీత గడువులోపల పూర్తిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పీ అరుణ్ బాబు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలకు సంబంధించి ఇంటి ఇంటి సర్వే జిల్లాలో 99.90 శాతం పూర్తి అయిందని తెలిపారు. 7,139 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, మృతుల ఓట్లు 5,620 ఉన్నాయని వివరించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని ఏఈఆర్వోలు, బూత్ లెవల్ అధికారులకు శిక్షణ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోపల పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ల తుది జాబితాలను జనవరి 6న ప్రకటించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జేసీ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఆర్వో, రెవెన్యూ డివిజినల్ అధికారులు మధులత, మురళి, రమాకాంత్ రెడ్డి, ఆర్వోలు శ్రీరాములు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ ఆగని సంక్షేమం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



రేమిడిచర్లలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తదితరులు

బొల్లాపల్లి, అక్టోబరు 1: మండలంలోని రేమిడిచర్లలో ప్రభుత్వం చేపట్టిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఆర్థిక సంక్షోభంలోను సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్న ప్రజాసారథి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. వైసీపీ హయాంలో ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచలేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారన్నారు. ఇసుక, మద్యం, గ్రానైట్ సహా అన్నింటిలో దోపిడీ చేశారని, మాజీ ఎమ్మెల్యే బొల్లా పాసు పుస్తకాలపై వేలకు వసూలు చేయించి కోట్లు దండుకున్నారన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు రామ లక్ష్మణుల్లా రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే జీవీ యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీమేరకు వరికపూడిశల ప్రాజెక్టును పూర్తి చేయటంతో పాటు ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ నెల 4న మంత్రి లోకేశ్‌తో కలసి వరికపూడిశల ప్రాజెక్టుపై మాట్లాడతామన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్యను పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ అందజేయనున్నట్టు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం 1500 బస్సులు కొనుగోలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2నుంచి కొత్త పింఛన్‌ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తారని, విభిన్న ప్రతిభా వంతులు ఉంటే సదరన్ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ గౌసాబేగం, తహసీల్దార్ సుధాకర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, పీ వెంకటనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, వాసుదేవరెడ్డి, కోటానాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, దాసరి కోటేశ్వరరావు, రావూరి నారాయణ, వెంకట కోటయ్య, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గాంధీ గుడి ప్రారంభం

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 1: పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో నేడు గాంధీగుడి ప్రారంభం కానుంది. ది మహాత్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడి నిర్మాణం జరిగింది. ఉదయం 10గంటలకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు, స్థానిక శాసన సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని గుడిని ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు శ్రీపాల్ రెడ్డి తెలిపారు.



కనీసం వేతనం అమలు చేయాలని ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కనీస వేతనం అమలు చేయాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

వినుకొండ టౌన్, అక్టోబరు 1: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కనీస వేతనం అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ వేతనాలు పెంచాలంటూ కేంద్ర ప్రభుత్వం ప్రతి పాదించినా, రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సంపెంగుల అబ్రహంరాజు, పచ్చిగొర్ల యేసు, కంచర్ల కోటేశ్వరరావు, రమణారెడ్డి, లింగాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణం నేర్చుకోవాలి: ప్రిన్సిపాల్

వినుకొండ టౌన్, అక్టోబరు 1: ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా చేరి సమాజ సేవలో భాగస్వాములు కావాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవాగుణంను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వినుకొండ చైర్మన్ బి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.అంజయ్య పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి రూ.25 వేలు ఆర్థికసాయం



చెక్కును అందిస్తున్న హిమాలయ గురుజీ, అనంత కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు

వినుకొండ టౌన్, అక్టోబరు 1: మెడికల్ విద్యార్థిని కళాశాల ఫీజు రూ.25వేలును వినుకొండ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనిగండ్ల అనంత కోటేశ్వరరావు, భార్య సువర్చల మంగళవారం అందజేశారు. ఏలూరు ప్రభుత్వ మెడికళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కనుగుల పూజిత అనే విద్యార్థి కళాశాల ఫీజ్‌ను మంగళవారం విఠంరాజుపల్లి సమీపంలోని హిమాలయ గురువు చేతులమీదుగా అందచేశారు. అదేవిధంగా హాస్టల్ మెస్‌చార్జీలను ప్రతినెల రూ.7 వేల రూపాయలను శాంతి ఆశ్రమం ట్రస్ట్ ద్వారా అందచేస్తున్నట్లు హిమాలయ గురువు తెలిపారు.

వైద్య పరీక్షల కోసం మృతదేహం అప్పగింత

రొంపిచర్ల, అక్టోబరు 1: మండలంలోని రొంపిచర్లలో కేతరాజుపల్లి నాగేశ్వరరావు (85) మంగళవారం మృతి చెందాడు. కాగా అతని కళ్ళు, మృతదేహాన్ని కుటుంబ సభ్యులు దానం చేశారు. కళ్ళను శంకర కంటి ఆస్పత్రికి, మృతదేహాన్ని మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్య కళాశాలకు అప్పగించారు. చనిపోయిన ఐదు గంటలలోపు సమాచారం తెలియజేస్తే మరొకరికి నేత్ర దానం చేసిన వారవుతారని అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహక సంఘం పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ చలపతిరావు తెలిపారు. నేత్రదానం, అవయవ దానం చేసిన నాగేశ్వరరావు కుమారుడు వేములయ్యను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.రామకృష్ణంరాజు, ఎస్.శేషంరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పసుమర్రు స్కూలు విద్యార్థులు ఎంపిక

చిలకలూరిపేట, అక్టోబరు 1: రాష్ట్రస్థాయిలో పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో త్వరలో జరగబోయే అండర్ 19 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనేందుకు చిలకలూరిపేట మండలం పసుమర్రు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ హైస్కూలులో జిల్లా స్థాయి పోటీలలో సోమవారం ఈ ఎంపికలు జరిగాయి. బాలుర విభాగంలో షేక్ రషీద్, బాలికల విభాగంలో షేక్ సుమయ్యా ప్రదీప్, షేక్ రేష్మాలు ఎంపికయ్యారు. గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పఠాన్ ఖాదర్ మస్తాన్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం యడవల్లి హనుమంతరావు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కోట సుదర్శనం, వైస్ చైర్మన్ గౌసియా, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు గద్దె హరిబాబు అభినందించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

చిలకలూరిపేట, అక్టోబరు 1: వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సేవా సంస్థ ఒయాసిస్ ఆధ్వర్యంలో వృద్ధులకు సేవలు అందించారు. పట్టణంలోని ప్రశాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రూ.10 వేల విలువ కలిగిన నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, మందులు అందచేశారు. వృద్ధులకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందచేశారు. కార్యక్రమంలో ఓయాసిస్ సంస్థ అధ్యక్షురాలు కందిమళ్ళ జయమ్మ, కార్యదర్శి కరణం విజయలక్ష్మి, సుమ, అమీనా తదితరులు పాల్గొన్నారు.

పసుమర్రులో 13మంది జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, అక్టోబరు 1: చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ పరిధిలోని పొలాలలో పేకాట ఆడుతున్న 13మందిని చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,400 స్వాధీనం చేసుకున్నారు. వారిని చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరిచారు. వారికి ఒక్కొక్కరికి రూ.300 జరిమానా విధించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో నాదెండ్ల విద్యారుల ప్రతిభ

నాదెండ్ల, అక్టోబరు 1: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. మండల కేంద్రమైన నాదెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలలో ప్రైవేట్ పాఠశాలల తరఫున సాతులూరుకు చెందిన ఈతరం ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ మాహినా, సీహెచ్ లోహిత, భువనలు ప్రథమ స్థానంలో గెలుపొందారు. అదేవిధంగా గణపవరంలోని తెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ సాత్విక్, కే లావణ్య, బీ రమ్యలు ప్రథమ స్థానం సాధించారు. వీరు ఈ నెల 27న జిల్లా స్థాయిలో జరగనున్న చెకుముకి పోటీలలో పాల్గొనున్నారు. వీరిని డైరెక్టర్లు పి.శివరామకృష్ణప్రసాదు, బి.సత్యనారాయణ, హెచ్ఎం కృష్ణనాయక్, వై శ్రీనివాసరావులు అభినందించారు.

జగన్‌రెడ్డి పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదు

ఎమ్మెల్యే జీవీ

బొల్లాపల్లి, అక్టోబరు 1: మండలంలోని పేరూరుపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మల్లికార్జునరావు, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏడీఏ రవిబాబు ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రంలో రైతులకు ఆత్మహత్యలు తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో ఏడాదికి 1100మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, అప్పులపాలయ్యారన్నారు. ఆ పరిస్థితి మార్చాలని ప్రజా ప్రభుత్వమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేరూరుపాడులో సాగు చేస్తున్న మిర్చి పంటను పరిశీలించి డ్రోన్ ద్వారా మిరప పంటను మందులను పిచికారిచేశారు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ పరికరాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో సాగు చేసేందుకు 90శాతం రాయితీపై పరికరాలు అందజేస్తుందన్నారు. బొల్లాపల్లి మండలం ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. భవిష్యత్‌లో మంచి ఆదాయం రావాలంటే ఉద్యానవన పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయకర్త నిశ్శంకర శ్రీనివాసరావు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, టీడీపీ నేతలు గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, దాసరి కోటేశ్వరరావు, కాసరగడ్డ గోవిందరాజులు, జీ రమణయ్య, కాట్ల వెంకటేశ్వర్లు, గరికపాటి శరత్, బొప్పూడి శ్రీను, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు

దుక్కిలో మాత్రమే కాంప్లెక్స్ ఎరువులు వాడాలి: డీడీఏ

శావల్యాపురం, అక్టోబరు 1: నాటు వేసిన తరువాత వరి పొలాల్లో కాంప్లెక్స్ ఎరువులను వాడటం వలన ప్రయోజనం ఉండదని, కేవలం దుక్కిలో మాత్రమే కాంప్లెక్స్ ఎరువులను వాడాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శావల్యాపురం మండలంలోని కొత్తలూరు, కనమర్లపూడి గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను డాట్ సైంటిస్ట్ వెంకటరాములు, వ్యవసాయశాఖాధికారులతో కలసి ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ట్రాక్టర్ పనిముట్లు, టార్పాలిన్ పట్టలు, తైవాన్ స్ప్రేయర్‌లు తదితర వ్యవసాయ సామగ్రి కావాలని రైతులు వ్యవసాయశాఖాధికారులను అడగగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి త్వరలో అందించేలా చర్యలు తీసుకొంటామన్నారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని, పొలాల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు, ఏఈవో పూరేటి అశోక, వీఏఏలు శ్రీనివాసరెడ్డి, స్రవంతి, గ్రామనేత ముక్కపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రెడ్డిపాలెం, చాకలికుంట తండా గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శివలీల గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీకాంత్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో హర్షకు బంగారు పతకం



ఫుట్‌బాల్ పోటీల్లో గోల్డు మెడల్ సాధించిన హర్షతో ఉపాధ్యాయులు

వినుకొండ, అక్టోబరు 1: అండర్-17 ఫుట్‌బాల్ విభాగంలో నిర్మలా ఇంగ్లీషు మీడియం పాఠశాల్లో 10వ తరగతి చదువుతున్న బి.హర్ష గోల్డు మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సెలీన్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. సెప్టెంబరు 30వ తేదీన పెనుమాకలో జరిగిన అండర్-17 100 మీటర్లు, 200మీటర్ల పరుగు పందెంలో మరో గోల్డుమెడల్ సాధించినట్లు అమె తెలిపారు. శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు విద్యార్థి హర్షను అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ సిసిలి, ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి గోవిందు, సిస్టర్ బెనడిక్టా, సిస్టర్ ఎల్సిచాకో, అథెటిక్స్ కోచ్ డి.అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న గీతమ్స్ విద్యార్థులు

గీతమ్స్ పాఠశాలలో గాంధీ జయంతి

వినుకొండ, అక్టోబరు 1: పట్టణంలోని గీతమ్స్ హైస్కూల్‌లో మహాత్మగాంధీ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళలర్పించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాచరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, పాఠశాల డైరెక్టర్ మాలపాటి కోటిరెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందచేశారు. విద్యార్థుల గాంధీజీ వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదుసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వైద్య విద్యార్థినికి రూ.50వేలు ఆర్థికసాయం

రొంపిచర్ల, అక్టోబరు 1: మండలంలోని రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో విద్యను అభ్యసించి నీట్ పరీక్షలో ఎంబీబీఎస్ సీటు సాధించిన రుద్రపాటి శ్రీనిధికి పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి నాయక్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డురాకూడదని శ్రీనిధికి పూర్వ విదార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

చెకుముకి పోటీలో విజేతలకు బహుమతులు

వినుకొండ, అక్టోబరు 1: ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చెకుముకి ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రిటైర్డు హెచ్ఎం, సీహెచ్. సుబ్బారెడ్డి మంగళవారం బహుమతులు అందచేశారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మోడల్ పాఠశాల, బాలికల జిల్లా పరిషత్, గీతాంజలి చెందిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు ముగ్గురు బాలికలు ఎంపిక

వినుకొండ, అక్టోబరు 1: ఈ నెల 28వ తేదీన చిలకలూరిపేట ఏఎంజీ స్కూల్‌లో నిర్వహించిన అండర్ 14, 17, 19 బాస్కెట్ బాల్ విభాగంలో వినుకొండ పట్టణంలోని గుడ్‌షెపర్డు పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.లక్ష్మీసునీత మంగళవారం తెలిపారు. అదేవిధంగా 30వ తేదీన నరసరావుపేట మున్సిపల్ పాఠశాల్లో నిర్వహించిన బాలికల పోటీల్లో ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన అఖిల్, మనోహర్, పవన్, యేగేశ్వరరావు, పవిత్ర, జోషిత, హాసిని, భార్గవి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

చెకుముకి పోటీలలో శావల్యాపురానికి ప్రథమస్థానం

శావల్యాపురం, అక్టోబరు 1: మండల స్థాయి చెకుముకి పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాల జట్టు ప్రథమ స్థానాన్ని, పోట్లూరు జడ్పీ పాఠశాల జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు పల్నాడు జిల్లా జనవిజ్ఞాన వేదిక కోశాధికారి సంద్రపాటి చలపతిరావు తెలిపారు. చలపతిరావు మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో శావల్యాపురం జడ్పీ పాఠశాల్లో మంగళవారం నిర్వహించిన పోటీల్లో వేల్పూరు, మతుకుమల్లి, శావల్యాపురం, పోట్లూరు జడ్పీ పాఠశాలల జట్లు పాల్గొనగా శావల్యాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు పద్మనాభుని జ్యోతిర్మయి, వల్లేటి ప్రసన్న, నల్లపునేని భవ్యశ్రీలు ప్రథమస్థానంలో, పోట్లూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు సొలస రూపశ్రీ, పోపూరి అక్షయ్, మందా యమునలు ద్వితీయస్థానంలో నిలిచారన్నారు. అక్టోబర్ 27న జరగనున్న జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో మండలం తరఫున శావల్యాపురం జడ్పీ పాఠశాల జట్టు పాల్గొంటుందన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, అక్టోబరు 1: మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సంతగుడిపాడు జడ్పీ పాఠశాల, రెడ్డిపాలెం ఏపీ మోడల్ పాఠశాల, సంతగుడిపాడు కేజీబీవీ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. వీరికి ప్రశంసా పత్రాలను, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల గుర్తింపునకు ఉపాధిహామీ గ్రామసభలు

శావల్యాపురం, అక్టోబరు 1: ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థికసంవత్సరంలో మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, కూలీల వేతనాలపై ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతరామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో మాట్లాడుతూ 3వ తేదీన కనమర్లపూడి, శావల్యాపురం, బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామాల్లో, 4వతేదీన శానంపూడి, ముండ్రువారిపాలెం, చిన్నకంచెర్ల, పిచికలపాలెం గ్రామాల్లో, 5వతేదీన గుంటుపాలెం, వయ్యకల్లు, కొత్తలూరు, కారుమంచి గ్రామాల్లో, 6వతేదీన వేల్పూరు, ఇర్లపాడు, పోట్లూరు పంచాయతీ కార్యాలయాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు: ఏడీఏ

యడ్లపాడు, అక్టోబరు 1: సమగ్ర సస్యరక్షణ చర్యలతో పత్తిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని నరసరావుపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మస్తానమ్మ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వ్యవసాయాధికారులతో కలసి మండలంలోని సొలస, లింగారావుపాలెం గ్రామాలలో పర్యటించారు. ముందుగా రైతులు సాగుచేస్తున్న వివిధ రకాల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేపకషాయం తయారు చేసుకునే విధానాన్ని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుతో ప్రదర్శన ఇప్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద రెతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పైరులో పచ్చదోమ, తామరపురుగులు ఉనికిని గుర్తించడం జరిగిందన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు సలహాదారుడు ప్రసాద్ రైతు బంధు పథకం, పత్తి మద్దతు ధరల గురించి రైతులకు వివరించారు. సొలస పశువైద్యాధికారి రోసర్‌బెన్ని పశువులకు సీజనల్‌గా వేయాల్సిన టీకాల గురించి కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు, తైవాన్ స్ప్రేయర్‌లు, టార్పాలిన్ పట్టాలు రాయితీపై ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సరిత, రైతులు పాల్గొన్నారు.